
ఈనాడు నంద్యాల

శనివారం సెప్టెంబరు 28, 2024

జలాశయాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి: బీసీ

అవుకు న్యూస్‌టుడే: రాష్ట్రంలో జలాశయాల నిర్వహణపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడి తెలిపారు. అవుకు జలాశయం రాతికట్ట కుంగిందని తెలిసిన వెంటనే అన్ని స్థాయిల్లోని అధికారులను అప్రమత్తం చేసినట్లు మంత్రి వెల్లడించారు. కలెక్టర్ రాజకుమారి, డ్యాంసేఫ్టీ రివ్యూ ప్యానల్ చీఫ్ ఇంజినీరు రత్నకుమార్, జలవనరుల శాఖ ప్రధాన ఇంజినీరు కబీర్ బాషాలతో కలిసి శుక్రవారం మంత్రి బీసీ అవుకు జలాశయాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జలాశయం నిర్వహణపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇక్కడ మురుగు వాగు ఆక్రమణకు గురికావడంపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. సర్వే నిర్వహించి అక్రమానికి పాల్పడిన వారికి నోటీసులు ఇస్తామని కలెక్టర్ తెలిపారు. చల్లా విజయభాస్కరరెడ్డి, ఉగ్రసేనారెడ్డి, మల్లికార్జునరెడ్డి, రమణానాయక్, దంతెల రమణ, మూరం భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.



కుంగిన రాతి కట్టను పరిశీలిస్తున్న నాయకులు అధికారులు

కౌలురైతులకు రుణాలు

నంద్యాల వ్యవసాయం, న్యూస్‌టుడే: జిల్లాలోని సీసీఆర్సీ కార్డు ఉన్న కౌలు రైతులు పంట రుణాలు పొందొచ్చని జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ తెలిపారు. కౌలు రైతులు సీసీఆర్సీ కార్డు, ఆధార్‌కార్డు, బ్యాంక్ పాసు పుస్తకం తదితర జిరాక్స్ కాపీలు, ఫొటోలు తీసుకెళ్లి ఆయా గ్రామాల సమీపంలోని బ్యాంకుల్లో సంప్రదించాలన్నారు. జిల్లాలో 23668 మంది కౌలురైతులకు సీసీఆర్సీ కార్డులు అందించినట్లు వివరించారు.

తీగలాగితే రూ.5 కోట్ల అక్రమాలు

- అమ్మకానికి విద్యుత్తు నియంత్రికల సామగ్రి

“విద్యుత్తు శాఖలో కొందరు అధికారులు, వైకాపా నేతలు కలిసి ‘తుప్పు’ను అమ్మకానికి పెట్టారు. కాలిపోయిన నియంత్రికల్లో ఉన్న తీగలు, ఇతర సామగ్రిని సరిహద్దు దాటించి రూ.కోట్లు వెనకేసుకొన్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో తొమ్మిది విద్యుత్తు నియంత్రికల మరమ్మతు కేంద్రాలు ఉన్నాయి. వీటి నిర్వహణ గుత్తేదారులకు అప్పగిస్తుంటారు.. గత ఐదేళ్ల వైకాపా పాలనలో ఆ పార్టీకి చెందిన కొందరు నేతలు గుత్తేదారులుగా అవతారమెత్తారు. మరమ్మతుల కేంద్రాలను అధీనంలోకి తీసుకొన్నారు. అధికారులను భయపెట్టారు.. అక్కడున్న సామగ్రిని అమ్మకానికి పెట్టారు. ఐదేళ్లలో రూ.5 కోట్ల స్క్రాప్ సొమ్మును పక్కదారి పట్టించినట్లు ఇటీవల నిర్వహించిన తనిఖీల్లో బయటపడింది.

– న్యూస్‌టుడే, నంద్యాల పట్టణం

తొమ్మిది కేంద్రాల్లో దందా

కర్నూలు, ఎమ్మిగనూరు, ఆదోని, పత్తికొండ, నంద్యాల, బనగానపల్లి, ఆళ్లగడ్డ, డోన్, ఆత్మకూరు పట్టణాల్లో విద్యుత్తు నియంత్రికల మరమ్మతుల కేంద్రాలు ఉన్నాయి.. కాలిపోయిన నియంత్రికలను మరమ్మతులు చేయించుకోవడానికి రైతులు ఆయా కేంద్రాలకు తీసుకొస్తుంటారు. ఏడాదికి ఒక్కో కేంద్రానికి 1000 నుంచి 1,200 వరకు వస్తుంటాయి. వేసవిలో వీటి సంఖ్య ఎక్కువగా ఉంటుంది. వాటిని బాగు చేసే క్రమంలో రాగి, అల్యూమినియం తీగలు తొలగించి కొత్తవాటిని బిగించాలి. తొలగించిన తీగలను కర్నూలు ప్రధాన కార్యాలయంలోని గోదాముకు తరలించారు.

రూ.5 కోట్లు పక్కదారి

టన్ను అల్యూమినియం తీగ విలువ ప్రస్తుతం బహిరంగ మార్కెట్లో రూ.1.40 లక్షలు పలుకుతోంది. టన్ను రాగి విలువ రూ.5.50 లక్షల వరకు ఉంది. ఒక్కో మరమ్మతు కేంద్రంలో సగటున ఏడాదికి 25 టన్నుల వరకు రాగి, 15 టన్నుల వరకు అల్యూమినియం స్క్రాప్ రూపంలో పోగవుతోందని అంచనా. నంద్యాల, ఆదోని, కర్నూలు కేంద్రంగా పెద్ద ఎత్తున అక్రమాలు జరిగాయి. ఆళ్లగడ్డ, పత్తికొండ, ఆత్మకూరు, డోన్‌లలో కొందరు అధికారులు అక్రమార్కులతో చేతులు కలిపి అవినీతికి పాల్పడినట్లు తెలుస్తోంది. గత ఐదేళ్ల రూ.5 కోట్ల వరకు స్క్రాప్ రూపంలో పక్కదారి పట్టినట్లు ఆరోపణలు ఉన్నాయి.



లెక్కలు మాయం

నియంత్రికల కేంద్రాల్లో పోగైన పాతసామగ్రిని ఎప్పటికప్పుడు కర్నూలు గోదాముకు తరలించారు. కొంత వరకు తరలించి మరికొంత వ్యాపారులకు అమ్మేశారు. విద్యుత్తు నియంత్రికల మరమ్మతుల తర్వాత ఎంత స్క్రాప్ మిగిలింది ? ఎంత కర్నూలుకు తరలించారనే వివరాలు తొమ్మిది కేంద్రాల్లో లేవు. కేంద్రాల నిర్వహణకు ప్రత్యేక విభాగం ఉంది. నెలలో రెండుసార్లు ఈఈ, ఆరుసార్లు డీఈఈలు పరిశీలించాలి. లెక్కలపై ఆరా తీయాలి.. గత ఐదేళ్లలో ఇవేవీ జరగలేదు.

101 నియంత్రికలు ఏమైనట్లు

కర్నూలులో 25, నంద్యాలలో 32, ఆదోనిలో 16, ఎమ్మిగనూరులో 9, ఆత్మకూరులో 11, డోన్‌లో 8 నియంత్రికలకు లెక్కలే లేవు. వీటిని గోదాములకు తరలించకుండా, వినియోగదారులకు ఇవ్వకుండా ఎక్కడికి తీసుకెళ్లారనే వివరాల్లేవు. నియంత్రికలతో పాటు రాగి, అల్యూమినియం వివరాలు సరిగ్గా లేవని ఇటీవల ఉన్నతాధికారులు నిర్ధారణకు వచ్చారు. కర్నూలు గోదాముకు చేరిన స్క్రాప్‌ను ముందస్తు ఒప్పందం ప్రకారం అస్మదీయ వ్యాపారులకే కట్టబెడుతున్నారు. మూడేళ్లుగా పక్క రాష్ట్రానికి చెందిన గుత్తేదారులకే గుట్టుచప్పుడు కాకుండా ఇస్తున్నారు.



భ్రమరాంబాదేవికి ఊయలసేవ

శ్రీశైలమహాక్షేత్రంలో శుక్రవారం భ్రమరాంబాదేవికి వైభవంగా ఊయలసేవ నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో విశేష పుష్పాలంకరణలతో స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను ఊయలపై కొలువుదీర్చారు. ఆలయ అర్చకులు స్వామి అమ్మవార్లకు షోడశోపచార పూజలు నిర్వహించారు. అమ్మవారికి అష్టోత్తరం, త్రిశతి, ఖడ్గమాల, సహస్ర నామపూజలు, స్వామి వారికి సహస్ర నామార్చనలు జరిపారు. అనంతరం విశేష పుష్పార్చనలు నిర్వహించి మంగళహారతులు సమర్పించారు.

– న్యూస్‌టుడే, శ్రీశైలం ఆలయం

1న సీఎం చంద్రబాబు రాక

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే : ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు జిల్లా పర్యటన ఖరారైంది. ఆయన వచ్చే నెల 1వ తేదీన పత్తికొండ మండలం పుచ్చకాయలమడ గ్రామానికి రానున్నారు. ఇంటింటికి వెళ్లి లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా పింఛను సొమ్ము పంపిణీ చేస్తారు. గ్రామస్థులతో సీఎం ముఖాముఖి అవుతారు.

ఆతిథ్య రంగం మరింత అభివృద్ధి చెందాలి




మాట్లాడుతున్న మంత్రి ఫరూక్


నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: హోటల్ పరిశ్రమతో వేలాది మందికి ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయని రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ.ఫరూక్ పేర్కొన్నారు. శుక్రవారం ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో రాష్ట్ర హోటల్స్ అసోసియేషన్ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ పర్యాటకం అభివృద్ధి చెందాలంటే హోటళ్లు బాగుపడాలన్నారు. రాష్ట్ర హోటల్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు బాలకృష్ణారెడ్డి, గౌరవ కార్యదర్శి నాగరాజు, కార్యనిర్వాహక కార్యదర్శి రఘువీర్, కోశాధికారి పూర్ణచందు, శ్రీనివాస్ బాబు పాల్గొన్నారు.

కంది కర్రల కళకళ

- అనూహ్యంగా పెరిగిన సాగు

ఖరీఫ్ ‘కాలం’ ముగిసింది.. పంట నమోదు పూర్తయ్యింది.. జిల్లాలో వర్షాలు ఆలస్యంగా కురవడంతో ఖరీఫ్ సీజన్లో 19,357 హెక్టార్లలో విత్తనం పడలేదు.. సాధారణ సాగుతో పోలిస్తే ఎనిమిది శాతం మేర తగ్గడం గమనార్హం. 1,88,224 హెక్టార్లలో పంటలు సాగు చేసిన రైతులతో వేలిముద్రలు వేయించారు. మరో 35,169 హెక్టార్లలో పంటలను సాగు చేసిన రైతులతో ఈ.కేవైసీ చేయించాల్సి ఉంది. కంది అనూహ్యంగా 40 వేల హెక్టార్లలో పెరిగింది. గతేడాది నుంచి కందులకు మంచి డిమాండ్ ఉంది. నాణ్యత బాగుంటే క్వింటా రూ.10 వేలు పలుకుతోంది. సాధారణ సాగు 36,234 హెక్టార్లు కాగా గతేడాది 32,725 హెక్టార్లలో.. ప్రస్తుతం 40,107 హెక్టార్లలో సాగైంది. తెల్లబంగారం 68 వేల హెక్టార్లు, వేరుశనగ 21,774 వేల హెక్టార్ల మేర తగ్గిపోయింది. గతేడాది ఉమ్మడి జిల్లాలో 79,180 హెక్టార్లలో మిర్చి సాగవగా.. ప్రస్తుతం కేవలం 45,227 హెక్టార్లకు పరిమితమైంది. అన్నిరకాల కూరగాయలు కలిపి కేవలం 797.60 హెక్టార్లలో మాత్రమే సాగవడం గమనార్హం.





నంద్యాల వ్యవసాయం, న్యూస్‌టుడే

మొక్కజొన్న వెలవెల

జిల్లాలో మొక్కజొన్న సాధారణ సాగు 45,210 హెక్టార్లు కాగా గతేడాది 53,226, ప్రస్తుతం 50,590 హెక్టార్లలో సాగైంది. సాగు పెరిగినా జులైలో వర్షాభావ పరిస్థితులు.. ఆగస్టు, సెప్టెంబరులో అధిక వర్షాల కారణంగా గింజ పట్టే దశలో సుంకు రాలిపోయింది. ఫలితంగా గింజ పలచగా పట్టిందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

‘తెల్ల’బోయిన బంగారం

పత్తి సాధారణ సాగు 23,516 హెక్టార్లు.. గత రెండేళ్లుగా ఆశించిన మేర దిగుబడులు రావడం లేదు.. ఫలితంగా చాలామంది పత్తిపై ఆసక్తి చూపడం లేదు.. గతేడాది 10,411 హెక్టార్లలో సాగవ్వగా.. ఈసారి6,619 హెక్టార్లకు పరిమితమైంది.

వేరుశనగ ఏటికేడు తగ్గుతూ..

జిల్లాలో వేరుశనగ సాధారణ సాగు 13,148 హెక్టార్లు కాగా గతేగాది 6,599 హెక్టార్లలో రైతులు పంట వేశారు. మూడేళ్లుగా వేరుశనగ సాగుపై ఆసక్తి చూపడం లేదు. సాధారణంతో పోలిస్తే 6,139 హెక్టార్లలో పంట సాగవలేదు.

ఘాటు తగ్గిన మిరప

మిర్చి సాధారణ సాగు 12,262 హెక్టార్లు కాగా గతేడాది 19,689 హెక్టార్లలో సాగైంది. రూ.లక్షలు పెట్టుబడి పెట్టినా ఆశించిన ధర రావడం లేదు. ఫలితంగా గతేడాదితో పోల్చితే ఈసారి 10,979 హెక్టార్లకు తగ్గించారు.

కల‘వరి’ంతలే

సకాలంలో వర్షాలు పడకపోవడం వరి నాట్లు ఆలస్యంగా మొదలయ్యాయి. సాధారణ సాగు 65,787 హెక్టార్లు కాగా.. వర్షాభావంతో గతేడాది 50,994 హెక్టార్లకు పడిపోయింది. ప్రస్తుతం 62,326 హెక్టార్లలో అతి కష్టంమీద 95 శాతానికి చేరింది.

నగదు రహిత పంచాయితీ

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: పంచాయతీ పన్ను వసూళ్లలో పారదర్శకతకు కేంద్రం తీసుకొచ్చిన నగదు రహిత విధానం అమలు అవస్థలమయంగా మారింది. గతేడాది జనవరి నుంచి ఈ విధానం అమల్లోకి తీసుకొచ్చారు. ఇందులో భాగంగా పంచాయతీల కార్యదర్శుల పేరిట యూనియన్ బ్యాంకులో ప్రత్యేక ఖాతాలు తెరిపించారు. పంచాయతీలకు క్యూఆర్ కోడ్, పీఓఎస్ పరికరాలు అందించారు. మూడు వేల లోపు జనాభా ఉన్న పంచాయతీలకు క్యూఆర్ కోడ్ స్కాన్ ద్వారా, మూడు వేలకు పైగా జనాభా ఉన్న పంచాయతీల్లో క్యూఆర్‌కోడ్‌తో పాటు, పీఓఎస్ పరికరాల ద్వారా చెల్లింపులు జరగాలని నిర్దేశించారు. ఇంటి, కుళాయి పన్నులు, ఇంటి నిర్మాణ ప్రణాళిక, జనన, మరణ ధ్రువీకరణ పత్రాల రుసుముతో పాటు ఇతర పన్నులను డిజిటల్ పేమెంట్ పద్ధతిలో వసూలు చేయాలి. నగదు రహిత పన్ను వసూలుకు ప్రయత్నాలు చేస్తున్నా ఖాతాలో నమోదవుతున్న డబ్బుకు, చెల్లింపులకు తేడాలు ఉంటున్నాయి. కొన్ని పంచాయతీల్లో సేవలు ప్రారంభమేకాలేదు.

మొత్తం పంచాయతీలు : 973

మూడు వేల లోపు జనాభా ఉన్నవి: 527

మూడు వేల కంటే అధిక జనాభా ఉన్నవి: 446



అమలు ఆపసోపాలు

- ఆళ్లగడ్డ మండలం ఓబులంపల్లె సచివాలయ కార్యాలయంలో గతేడాది ఆస్తిపన్ను వసూలుకు నగదు రహిత విధానాన్ని అమలు చేయాలనుకున్నారు. సచివాలయ ఖాతాలో చెల్లింపులకు, జమలకు తేడా రావడం సమస్యగా మారింది. చిన్నవి కాకుండా పెద్ద మొత్తాలనే నగదు రహితంగా స్వీకరిస్తున్నారు.
- జి.జంబులదిన్నె గ్రామ పంచాయతీలో 2160 మంది జనాభా ఉండగా 585 గృహాలు ఉన్నాయి. పన్నుల రూపేణా రూ.72వేలు (డిమాండ్) వసూలు చేస్తున్నారు. నగదు రహితంగానే ఆస్తి పన్ను వసూలు చేసినట్లు కార్యదర్శి చెబుతున్నారు. చెల్లింపులకు, ఖాతాలో చేరిన మొత్తానికి రూ.800 తేడా వచ్చిందని, సాంకేతిక లోపాన్ని సరిదిద్ది తిరిగి ఖాతాలో వేస్తామని బ్యాంకు అధికారులు తెలిపినట్లు పంచాయతీ కార్యదర్శి తెలిపారు.



సలీంనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులు

పిండిబడిలో మంచినీరు

- అంగన్‌వాడీ కేంద్రాల్లో వసతులు
- 231 కేంద్రాలకు రూ.1.55 కోట్లు

నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే: ఐదేళ్ల అధికారంలో ఉన్న వైకాపా అంగన్‌వాడీలను పట్టించుకోలేదు.. కేంద్రాల్లో కనీస సౌకర్యాలు కల్పించేందుకు ముందుకు రాలేదు.. కొన్ని భవనాలు శిథిలావస్థకు చేరాయి.. మరి కొన్ని చోట్ల మంచినీళ్లు లేవు.. వీటిని గమనించి ‘కూటమి’

ప్రాజెక్టు	మరుగుదొడ్లు	నిధులు (రూ.లక్షల్లో)	తాగునీటి పనులు	నిధులు (రూ.లక్షల్లో)
ఆళ్లగడ్డ	35	12.60	50	8.50
ఆత్మకూరు	38	13.68	71	12.07
బనగానపల్లె	51	18.36	72	12.24
డోన్	34	12.24	68	11.56
నందికొట్కూరు	42	15.12	109	18.53
నంద్యాల	31	11.16	55	9.35

ప్రభుత్వం మౌలిక వసతులు కల్పించాలని నిర్ణయించింది. కేంద్రాల్లో మంచినీరు, మరుగుదొడ్ల సౌకర్యం ఉండాలని అధికారులను ఆదేశించింది.. ఒక్కో మరుగుదొడ్డి నిర్మాణానికి రూ.36 వేలు, తాగునీటి వసతికి రూ.17 వేలు మంజూరు చేసింది. జిల్లాలోని ఆరు ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో 231 అంగన్‌వాడీ కేంద్రాల్లో మరుగుదొడ్ల నిర్మాణానికి రూ.83,16,000, మంచినీటి వసతులకు రూ.72,25,000 మంజూరయ్యాయి. జిల్లా గ్రామీణ నీటి సరఫరా విభాగం (ఆర్‌డబ్ల్యూఎస్) ఆధ్వర్యంలో పనులు చేపట్టనున్నారు. “ఇప్పటికే ప్రణాళిక పూర్తయ్యింది.. త్వరలో పనులు ప్రారంభిస్తామని” పీడీ లీలావతి పేర్కొన్నారు.

నష్టపరిహారం రూ.37.02 లక్షలు

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: జిల్లాలో గత నెల 30, 31 తేదీల్లో కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న గృహాలు, పశు సంపదకు సంబంధించి బాధితులకు రూ.37.02 లక్షల నష్టపరిహారం ప్రభుత్వం మంజూరు చేసిందని కలెక్టర్ జి.రాజకుమారి తెలిపారు. దెబ్బతిన్న ఇంటికి రూ.10 వేల చొప్పున 332 ఇళ్లకు, మేకకు రూ.7,500 ల చొప్పున 45 మేకలకు ఈ పరిహారం మంజూరు అయిందని ఆమె శుక్రవారం వెల్లడించారు.

చంద్రబాబు మాటిచ్చి నిలబెట్టుకున్నారు

- తాను కోట్ల ఇంటి నుంచి వచ్చిన మనిషినే
- విత్తనాభివృద్ధి సంస్థ ఛైర్మన్ ధర్మవరం

డోన్, న్యూస్‌టుడే: “కోట్లను ఎమ్మెల్యేగా గెలిపిస్తే సుబ్బారెడ్డికి న్యాయం చేసే బాధ్యత నాది” అని డోన్‌లో ఎన్నికల సమయంలో పర్యటిస్తూ చంద్రబాబు భరోసా ఇచ్చారని, ఆయన అన్నట్లుగానే తనకు రాష్ట్ర పదవి ఇచ్చి ఆయన మాట నిలబెట్టుకున్నారని రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ ఛైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి పేర్కొన్నారు. విత్తనాభివృద్ధి సంస్థ ఛైర్మన్‌గా నియమితులైన తర్వాత తొలిసారిగా శుక్రవారం డోన్‌కి వచ్చిన ఆయనకు కార్యకర్తలు అభిమానులు అమకతాడు టోల్‌గేటు నుంచి ఘన స్వాగతం పలికారు. అనంతరం పట్టణంలోని ఎన్టీఆర్ విగ్రహానికి సుబ్బారెడ్డి పూలమాలలు వేసి, కొత్త బస్టాండ్ మీదుగా పాత బస్టాండ్ వరకు నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం కార్యకర్తలను ఉద్దేశించి సుబ్బారెడ్డి మాట్లాడుతూ మంత్రి బీసీ, గౌరువెంకటరెడ్డి, కేఈ ప్రతాప్‌లతో పాటుగా జిల్లాలోని ఎమ్మెల్యేలు తనను ఎంతగానో ప్రోత్సహించారన్నారు. డోన్ ఇన్‌ఛార్జిగా గతంలో క్లిష్ట పరిస్థితుల్లో బాధ్యతలు చేపట్టినప్పుడు కార్యకర్తలు అండగా నిలిచారన్నారు. ఎమ్మెల్యే కోట్లతో కలిసి డోన్ నియోజకవర్గాన్ని తెదేపా కంచుకోటగా మారుస్తానన్నారు. విజయవాడ దుర్గమ్మను దర్శించుకున్న అనంతరం నేరుగా తాను కర్నూలుకు వెళ్లి కోట్ల దంపతుల ఆశీర్వాదం తీసుకున్నాకే ఇక్కడికి వచ్చానన్నారు. తాను కోట్ల ఇంటి నుంచి వచ్చిన మనిషిని అని, పార్టీలో ఏవో చిన్న చిన్న సమస్యలు వస్తే వాటిని ఎలా పరిష్కరించుకోవాలో తమకు తెలుసునన్నారు. మున్సిపల్ మాజీ ఛైర్మన్ మురళీకృష్ణగౌడ్, పట్టణ అధ్యక్షుడు సీఎం శ్రీను, బేతంచెర్ల మండల నాయకులు షేక్షావలిచౌదరి ఉన్నారు.



అభిమానులు ఇచ్చిన కత్తిని చూపుతున్న సుబ్బారెడ్డి

1066 చరవాణుల రికవరీ: ఎస్పీ



రికవరీ చేసిన చరవాణులను చూపుతున్న ఎస్పీ, డీఎస్పీ

నంద్యాల నేరవిభాగం, న్యూస్‌టుడే: జిల్లాలో 1066 చరవాణుల్ని రికవరీ చేసినట్లు ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా పేర్కొన్నారు. శుక్రవారం ఎస్పీ కార్యాలయంలో మూడో విడత మొబైల్ రికవరీ మేళా నిర్వహించి బాధితులకు చరవాణులను అందజేసే కార్యక్రమం చేపట్టారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ 1066 చరవాణుల్ని రికవరీ చేశామని, వాటి విలువ రూ.2.43కోట్లు ఉంటుందన్నారు. 2023లో ఏప్రిల్‌లో 847, 2023 అక్టోబరులో 510 రికవరీ చేశామని, ఇప్పటివరకు 2426 రికవరీ చేయగా వాటివిలువ రూ.4.82 కోట్లు ఉంటుందన్నారు. ఇవన్నీ మహారాష్ట్ర, తమిళనాడు, కర్ణాటక, గోవా, తెలంగాణ రాష్ట్రాల నుంచి అతి తక్కువ సమయంలో రికవరీ చేశామన్నారు. ఇంకా ఎవరైనా చరవాణిని పోగొట్టుకుంటే 9121101107 నంబరు వాట్సాప్‌కు ‘హాయ్’ అని సందేశాన్ని పంపితే ఒక లింక్ వస్తుందని వాటిలో వివరాలు నమోదు చేయాలన్నారు.

కల్తీ పరీక్షలకు తుప్పు

- ప్రాంతీయ ప్రయోగశాల నిర్వీర్యం
- వేధిస్తున్న సిబ్బంది కొరత

కర్నూలు వైద్యాలయం: ఆహార పదార్థాల్లో కల్తీలు పరీక్షించే ప్రయోగశాలకు తుప్పుపట్టింది. ఎంతో సదుద్దేశంతో కర్నూలు వైద్య కళాశాల ఆవరణలో 1958లో ఏర్పాటు చేసిన ‘ప్రాంతీయ ప్రయోగశాల’ నిర్వీర్యమైంది. ఆరోగ్య, కుటుంబ సంక్షేమ విభాగం డైరెక్టర్ పరిధిలోని ‘ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసిన్’ (ఐ.పి.ఎం.) ఆధ్వర్యంలో దీనిని నిర్వహిస్తున్నారు. నామమాత్రపు ఛార్జీలతో మంచినీరు, ఆహార ఉత్పత్తులు, నూనెలు, పాలు, పప్పులు, పొడులు, వ్యాధి నిర్ధారణ పరీక్షలు ఇక్కడ చేయాల్సి ఉంది. 2009లో కర్నూలు నగరానికి పెద్దఎత్తున వరదలు వచ్చినప్పుడు ప్రయోగశాల భవనం సగం వరకు మునిగిపోయింది. ఉపకరణాలు దెబ్బతిన్నాయి. అప్పటినుంచి ఇప్పటివరకు కొత్త పరికరాలు రాలేదు. ఫలితంగా ప్రయోగశాలలో పలురకాల పరీక్షల నిర్వహణకు మంగళం పాడారు. ప్రస్తుతం ఆహార పదార్థాల్లో కల్తీలు పెరిగిన నేపథ్యంలో ప్రయోగశాలను ఆధునికీకరించాల్సిన అవసరం ఉంది.

– న్యూస్‌టుడే, ఈనాడు, కర్నూలు



ప్రయోగశాలలోని ఓ గది ఇలా..

సంవత్సరం	పరీక్షించిన నీటి నమూనాలు	వచ్చిన ఆదాయం
2022–23	12,156	రూ.10,20,720
2023–24	12,012	రూ.10,26,100

కల్తీని గుర్తించే వ్యవస్థను ఎత్తేశారు

- నూనెలు, పాలు, పప్పులు, కాఫీ, టీ తదితర పొడులకు సంబంధించిన కల్తీలు నిర్ధరించేందుకు కార్యాలయంలో ఇద్దరు జూనియర్ సైంటిఫిక్ అధికారులను గతంలో నియమించారు. ప్రస్తుతం ఆ రెండు పోస్టులు గత కొన్నేళ్లుగా ఖాళీగానే ఉన్నాయి. ఫలితంగా ఆయా ఉత్పత్తుల్లో కల్తీని నిర్ధారించే పరీక్షలు నిర్వహించే వ్యవస్థను ఎత్తేశారు. ఆ రెండు పోస్టులు భర్తీ చేసినా ఆహార పదార్థాల కల్తీని గుర్తించే ఉపకరణాలు ఒక్కటి కూడా లేదు.
- కార్యాలయ ఉన్నతాధికారిగా సివిల్ సర్జన్ బ్యాక్టీరియాలజిస్ట్ (సి.ఎస్.బి.) బాధ్యతలు నిర్వర్తిస్తుంటారు. గత పదేళ్లుగా ఆ పోస్టు ఖాళీగా ఉంది. ఆయన ఆధ్వర్యంలో విధులు నిర్వర్తించేందుకు ఇద్దరు సివిల్ అసిస్టెంట్ సర్జన్లు ఉంటారు. ఇద్దరే ఉండటంతో పరీక్షలు చేయడం లేదు.

ఉద్యోగుల కుర్చీలన్నీ ఖాళీ

- నలుగురు ల్యాబ్ టెక్నీషియన్లు ఉండాల్సి ఉండగా పోస్టులన్నీ ఖాళీగా ఉన్నాయి. ఫలితంగా ప్రయోగ పరీక్షలన్నీ పడకేశాయి. నమూనాలు సేకరించేవారు ముగ్గురు ఉండాల్సి ఉండగా ఒక్కరు మాత్రమే అందుబాటులో ఉన్నారు. ఒకరిని ఒప్పంద ప్రాతిపదికన నియమించుకున్నారు. ముగ్గురు జూనియర్ వాటర్ ఎనలిస్టులు ఉండాల్సి ఉండగా ఒక్కరు మాత్రమే ఉన్నారు.
- దశాబ్దాల కిందట ఏర్పాటుచేసిన సంస్థ కావడంతో పలువురు ఉద్యోగులు పదవీ విరమణ చేశారు. ఆ తర్వాత భర్తీ ప్రక్రియ చేపట్టకపోవడంతో కార్యాలయంలో సిబ్బంది సంఖ్య క్రమంగా తగ్గుతూ వచ్చింది.

నీటి పరీక్షలతోనే నెట్టుకొస్తున్నారు

ప్రాంతీయ ప్రయోగశాలలో ప్రస్తుతం ఇన్‌క్యుబేటర్, ఎలక్ట్రిక్ కండక్టివిటీ (ఇ.సి.) మీటరు, పీహెచ్ మీటరు, ఎలక్ట్రానిక్ బ్యాలెన్స్ మాత్రమే ఉన్నాయి. ఆయా పరికరాలతో నీటి నాణ్యతను, స్వచ్ఛతను మాత్రమే తెలుసుకోవచ్చు. కార్యాలయంలో ఒక సీనియర్ వాటర్ ఎనలిస్ట్, ఒక జూనియర్ వాటర్ ఎనలిస్ట్ ఉండడంతో నీటికి సంబంధించిన రసాయన, బ్యాక్టీరియల్ ఎనాలసిస్ పరీక్షలు చేస్తున్నారు. ప్రజారోగ్యానికి సంబంధించిన పరీక్షల్లో టీబీ పరీక్షలు మాత్రమే చేయగలుగుతున్నారు.



సమీక్షిస్తున్న రాజకుమారి

మరుగుదొడ్ల నిర్మాణం పూర్తి చేయాలి: కలెక్టర్

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: జిల్లాలోని 439 అంగన్‌వాడీ కేంద్రాల్లో 231 మరుగుదొడ్లు, 425 తాగునీటి పైపులైన్ల ఏర్పాటుకు ప్రభుత్వం రూ.1.55 కోట్లు మంజూరు చేసిందని, నిర్మాణ పనులు వేగంగా పూర్తి చేసేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ జి.రాజకుమారి ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో అంగన్‌వాడీ కేంద్రాల్లో మరుగుదొడ్లు, మంచి నీటి సౌకర్యాలపై ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీరింగ్ అధికారులు, సీడీపీవోలతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఒక్కో మరుగుదొడ్డి నిర్మాణాన్ని మూడు రోజుల్లో పూర్తి చేయిస్తున్నామని, నిర్మాణ పనులు వెంటనే ప్రారంభించి అక్టోబరు 31లోగా నాణ్యతతో పూర్తి చేయాలన్నారు. ఉపాధి హామీ కింద 100 రోజుల ప్రణాళికలో భాగంగా నిర్మించాల్సిన మురుగు కాల్వల నిర్మాణ పనులు పూర్తి చేయాలన్నారు. జలజీవన్ మిషన్‌లో ఇంటింటి కుళాయి కనెక్షన్ ఏర్పాటులో భాగంగా ఉన్న సమస్యలను అధిగమించి పనులు పూర్తి చేయాలన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ మనోహర్, ఐసీడీఎస్ పీడీ లీలావతి, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈలు, ఏఈలు, సీడీపీవోలు పాల్గొన్నారు.

దరఖాస్తులు ఆహ్వానం

నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే: మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నంద్యాలలో నిర్వహిస్తున్న శిశుగృహ, ఆళ్లగడ్డలోని బాలసదనంలో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి గానూ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా స్త్రీ, శిశు అభివృద్ధి, మహిళా సాధికారత అధికారిణి లీలావతి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నంద్యాల పొన్నాపురం కాలనీలోని శిశుగృహలో పార్ట్‌టైం డాక్టర్, అయిదుగురు ఆయాల పోస్టులకు ఒప్పంద పద్ధతిలో నియామకాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఆళ్లగడ్డ బాల సదనంలో ఖాళీగా ఉన్న ఎడ్యుకేటర్, ఆర్ట్‌క్రాఫ్ట్ మ్యూజిక్ టీచర్, పీటీ ఇన్‌స్ట్రక్టర్, యోగా టీచర్ పోస్టులను భర్తీ చేయనున్నట్లు తెలిపారు. ఎస్సీ అభ్యర్థులకు అయిదేళ్లు, దివ్యాంగులకు పదేళ్లు వయసు సడలింపు ఉంటుందన్నారు. అభ్యర్థులు సెప్టెంబరు 28 నుంచి అక్టోబరు 11 వ తేదీ లోగా నంద్యాల పట్టణంలోని దాబరాల్ మసీదు సమీపంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో దరఖాస్తులు ఇవ్వాలన్నారు. సంబంధిత ధ్రువపత్రాలు తీసుకురావాలన్నారు.

ఆలూరు కుర్రాడు..
చైనాలో మెరిశాడు

■ పల్లె నుంచి అంతర్జాతీయ స్థాయికి ■ సెపక్‌తక్రాలో సత్తా చాటిన మధు

ఆలూరు, న్యూస్‌టుడే: అసలే కరవు ప్రాంతం.. వలసలకు పెట్టింది పేరు. అలాంటి పల్లె ఎల్లలు దాటి చైనాలో సత్తా చాటాడు. నాన్నకు పనుల్లో సాయంగా ఉంటూనే.. మైదానంలో ఆటల సాధన చేశాడు. తెలుగు రాష్ట్రాల నుంచి ఎంపికైన ఒకే ఒక్కడు ఆ కుర్రాడు. జీవన ప్రణాళికతో మలుచుకున్న, తన ఇష్టమైన క్రీడలో రాణిస్తున్నాడు.



చైనాలో మేనేజరు, కోచ్‌లతో భారత ఆటగాళ్లు

నాన్నకు సాయంగా ఉంటూనే..

ఆలూరు పట్టణానికి చెందిన బసవరాజు, సరస్వతి దంపతులది మధ్య తరగతి కుటుంబం. పట్టణంలోని జాతీయ రహదారి పక్కన చిన్నపాటి దుకాణంలో రోజూ సాయంత్రం వేళ ఫాస్టుఫుడ్ తయారు చేస్తారు. అదే వీరికి జీవనాధారం. ఉన్నదాంట్లోనే ఇద్దరు కుమారులను మంచి చదువులు చదివించారు. పెద్ద కుమారుడు మధు చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి పెంచుకున్నాడు. పాఠశాల స్థాయి నుంచే వ్యాయామ ఉపాధ్యాయుల శిక్షణలో సెపక్‌తక్రాలో పట్టు సాధించాడు. తల్లిదండ్రులు కూడా ప్రోత్సహించారు. గల్లీ నుంచి అంతర్జాతీయ స్థాయికి ఎదిగాడు. చిన్నప్పుడు మొదలైన ఆట డిగ్రీ చదువుతున్నా ఆపలేదు. తండ్రి నిర్వహిస్తున్న గోబీ తయారీలో సాయమందిస్తూనే.. తాను క్రీడా సాధన చేసేవాడు.

అంతర్జాతీయ స్థాయి పోటీల్లోనూ సత్తా

జిల్లాలో వెనుకబడిన ఆలూరు నియోజకవర్గం నుంచి సెపక్‌తక్రా పోటీల్లో అంతర్జాతీయ స్థాయిలో పాల్గొన్న మొదటి క్రీడాకారుడిగా మధు నిలిచాడు. మధు ఇప్పటి వరకు 20 సార్లు రాష్ట్ర, 15 సార్లు ఆంధ్ర జట్టు తరఫున జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొన్నాడు. జాతీయ స్థాయిలో 15 సార్లు ఆంధ్ర జట్టుకు కెప్టెన్‌గానూ వ్యవహరించాడు. సారథిగానే కాకుండా ఆటగాడిగానూ ఉత్తమ ప్రదర్శన కనబరిచి జాతీయ స్థాయి పోటీల్లో తమ జట్టు విజయానికి కీలకంగా వ్యవహరించాడు. ఆంధ్రప్రదేశ్‌తో పాటు హిమాచల్ ప్రదేశ్, అస్సాం, కర్ణాటక, తెలంగాణ, బిహార్, తమిళనాడు, గోవా వంటి రాష్ట్రాల్లో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో సత్తా చాటి పలు మార్లు బంగారు, కాంస్య పతకాలు, ప్రశంసా పత్రాలు, షీల్డులు అందుకున్నాడు.

మూడో స్థానంలో నిలిచి..



మధు, సెపక్‌తక్రా క్రీడాకారుడు

తాజాగా దిల్లీలో ఆగస్టు 11న జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో సత్తా చాటి అంతర్జాతీయ పోటీలకు ఎంపికయ్యాడు. సెప్టెంబరు 18 నుంచి 23వ తేదీ వరకు చైనాలోని కింగ్ డావోలో జరిగిన అంతర్జాతీయ స్థాయి ఏషియన్ బీచ్ సెపక్‌తక్రా చాంపియన్‌షిప్ పోటీల్లో పలు రాష్ట్రాలకు చెందిన ఐదుగురితో పాటు మధు భారత జట్టు తరపున పాల్గొని ప్రతిభ చాటారు. భారత జట్టు సెమీ ఫైనల్ వరకు వెళ్లడంలో కీలకంగా వ్యవహరించారు. అంతర్జాతీయ స్థాయి పోటీల్లో ఓ మ్యాచ్‌కు కెప్టెన్‌గా వ్యవహరించారు. భారత జట్టు చైనా, ఇరాక్, కొరియా జట్లపై విజయం సాధించింది. సెమీ ఫైనల్‌లో థాయిలాండ్ జట్టు చేతిలో పరాజయం పొంది అంతర్జాతీయ స్థాయిలో మూడో స్థానంలో నిలిచారు. దాంతో జట్టులో సభ్యుడైన మధు కాంస్య పతకం అందుకున్నాడు.

దసరా ఉత్సవాలకు రారండోయ్

■ మహానందిలో ఆహ్వానం పలికిన ఈవో, పండితులు



ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న ఈవో, ఏఈవో, పండితులు

మహానంది, న్యూస్‌టుడే: భక్తులారా... మహానంది పుణ్యక్షేత్రంలో దేవస్థాన ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలకు తరలిరండి అని ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి ఆహ్వానం పలికారు. శుక్రవారం మహానందిలోని అలంకార మండపంలో గంగా కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వార్లకు అభిషేకాలు, అర్చనలు పూజలను ప్రధానార్చకుడు మామిళ్లపల్లి అర్జునశర్మ, వేదపండితులు రవిశంకర అవధాని, నాగేశ్వరశర్మ ఈవోతో పాటు ఏఈవో వై.మధు, ప్రొటోకాల్ ఇన్‌స్పెక్టర్ శశిధరరెడ్డితో పూజలు చేయించారు. అనంతరం ఈవో వివరాలు తెలిపారు. అక్టోబరు 3 నుంచి 12 వరకు నిత్యపూజలు, హోమాలు, గ్రామోత్సవ కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. ఉత్సవాలు పురస్కరించుకొని అమ్మవారిని ఒక్కోరోజు ఒక్కో అలంకారంలో అలంకరిస్తామన్నారు. 3న శైలపుత్రి, 4న బ్రహ్మచారిణి, 5న చంద్రఘంటదుర్గా, 6న కూష్మాండదుర్గ, 7న స్కంద మాత, 8న కాత్యాయనీ, 9న కాలరాత్రిదుర్గం, 10న మహాగౌరీ, 11న సిద్ధిధాత్రిదుర్గ, 12న కామేశ్వరీదేవి నిజరూప అలంకారాలు ఉంటాయన్నారు. ఈ ఉత్సవాల్లో సాంస్కృతిక కళాప్రదర్శనలు కూడా ఉంటాయని వివరించారు. ఉపప్రధానార్చకులు కొమ్మద్ది శంకరయ్య, నీలకంఠం, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



పాఠశాల ఉపాధ్యాయులకు ఆర్థిక సాయం అందిస్తున్న శ్రీసుధ పాఠశాల యాజమాన్యం

వరద బాధితులకు సాయం

డోన్‌పట్టణం, న్యూస్‌టుడే : వరదల వల్ల నష్టపోయిన ప్రైవేట్ పాఠశాల ఉపాధ్యాయులను ఆదుకునేందుకు డోన్‌కు చెందిన శ్రీసుధ పాఠశాలల యాజమాన్యం తమ వంతు బాధ్యతగా ఆర్థిక సాయాన్ని అందించినట్లు పాఠశాల డైరెక్టర్ సుధాకర్‌గుప్త శుక్రవారం తెలిపారు. బాపట్ల జిల్లా భట్టిప్రోలు మండలంలోని పెదలంక స్వాతి ఆంగ్లమాధ్యమం పాఠశాల ఉపాధ్యాయులు వరదల వల్ల ఎంతో నష్టపోయారన్నారు. దీంతో తమ పాఠశాలల విద్యార్థులు సేకరించిన విరాళాల మొత్తాన్ని పెదలంక స్వాతి ఇంగ్లీష్ మీడియం పాఠశాలకు చెందిన ఒక్కో ఉపాధ్యాయుడికి రూ. 4వేల చొప్పున 26 మంది ఉపాధ్యాయులకు ఏపీ అన్ ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ కమిటీ (అపుస్మా) సమక్షంలో రూ. 1.04లక్ష ఆర్థిక సాయాన్ని అందించినట్లు సుధాకర్‌గుప్త తెలిపారు.

డోన్, న్యూస్‌టుడే : వరద బాధితులకు సోంపురం గ్రామం తరుపున 20వేల రుపాయలను గ్రామనాయకుడు లక్ష్మీకాంత రెడ్డి తెదేపా నాయకులు ఓబులాపురం శేషిరెడ్డి, వలసల రామకృష్ణ, సలీంద్ర శ్రీనివాసులుకి శుక్రవారం అందజేశారు.

రూ.10 వేల ఆర్థిక సాయం

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: వరద బాధితులకు నంద్యాల ఎగ్జిబిషన్ యజమాని శ్రీను చౌదరి రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. శుక్రవారం రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ.ఫరూక్‌ను కలిశారు. సీఎం రిలీఫ్ ఫండ్‌కు జమ చేసిన రశీదును అందజేశారు. కార్యక్రమంలో రవి చౌదరి తదితరులు పాల్గొన్నారు.



మంత్రి ఫరూక్‌కు రశీదును అందజేస్తున్న శ్రీను చౌదరి

పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయాలి

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: జిల్లా పర్యాటక రంగాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించాలని జేసీ సి.విష్ణుచరణ్ పర్యాటక అధికారులకు సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్‌పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఎకో టూరిజం, టెంపుల్ టూరిజం, ప్రఖ్యాతిగాంచిన గుహ సంపదలు ఉన్నాయన్నారు. విద్యార్థి దశ నుంచే పర్యాటక రంగంపై అవగాహన పెంచుకోవాలన్నారు. పర్యాటక రంగం ద్వారానే ప్రపంచంలోని వివిధ దేశాలు ఆర్థికంగా అభివృద్ధి చెందాయన్నారు. పర్యాటక అధికారి సత్యనారాయణ మాట్లాడుతూ జిల్లాలోని ప్రముఖ పర్యాటక ప్రదేశాలను ఏడు టూరిజం సర్క్యూట్లుగా విభజించి అభివృద్ధి చేస్తున్నట్లు వివరించారు. అనంతరం స్వదేశీ దర్శన్ 2.0 ఛాలెంజ్ డెస్టినేషన్ కరపత్రికను జేసీ ఆవిష్కరించారు. క్విజ్ పోటీల్లో గెలుపొందిన వివిధ పాఠశాలల విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందజేశారు.



ప్రశంసాపత్రాలు అందజేస్తున్న జేసీ

కాటికి వెళ్లే దారిలోనూ కన్నీటి కష్టాలే..!

కోవెలకుంట్ల న్యూస్‌టుడే: మనిషిని కోల్పోయి ఆవేదన చెందుతున్న వారికీ అవస్థలు తప్పడం లేదు. కోవెలకుంట్ల మండలంలోని గుల్లదుర్తిలో శ్మశాన వాటికకు వెళ్లేందుకు దళితులు ఇబ్బందులు పడుతున్నారు. శ్మశాన వాటికకు వెళ్లే దారి చుట్టూ పొలాలు ఉండటంతో కష్టాలపాలవుతున్నామని, పొలంలోని నీరంతా దారిలో నిలిచిపోవడంతో పాటు పిచ్చిమొక్కలు పెరిగాయని చెబుతున్నారు. ఇలాంటి దారిలో మృతదేహాన్ని తీసుకెళ్లేటప్పుడు ఇబ్బందులపాలవుతున్నామని, మృతదేహాన్ని మోస్తూ బురదలో జారిపడుతున్నామని, శాశ్వత దారిని నిర్మించాలని అంతా కోరుతున్నారు.



వరి పొలం మధ్యలో ఇబ్బందులు పడుతూ మృతదేహాన్ని మోసుకెళ్తున్న దళితులు

మినుము పంట దున్నివేత



మండలంలోని బ్రాహ్మణపల్లె గ్రామానికి చెందిన కౌలురైతు సూరిబాబు 5 ఎకరాల్లో సాగు చేసిన మినుము పంటను శుక్రవారం దున్నేశాడు. 70 రోజుల క్రితం సాగుచేసిన మినుము పంట వాతావరణ పరిస్థితులు అనుకూలించకపోవడంతో పూత రాక, తెగులు సోకి పచ్చగా మారిపోయింది. దీంతో పంట దిగుబడి రాదని భావించి ట్రాక్టరుతో దున్నేశాడు. దీంతో రూ.1.5లక్షల నష్టం వాటిల్లిందని రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని రైతు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, చాగలమర్రి**

ఎరువుల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలి: జేసీ

నంద్యాల వ్యవసాయం, న్యూస్‌టుడే: జిల్లాలో రైతులకు అవసరమైన ఎరువుల కొరత లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని జేసీ విష్ణుచరణ్ అన్నారు. శుక్రవారం నంద్యాలకు వచ్చిన ఎరువుల వ్యాగన్లను తనిఖీ చేసి వివరాలను పరిశీలించారు. ముందస్తు ప్రణాళికలతో జిల్లాలో సాగవుతున్న పంటలకు సరిపడ ఎరువులు అందుబాటులో ఉంచాలని సూచించారు. జిల్లాకు వచ్చిన ఎరువుల్లో 50 శాతం మార్క్‌ఫెడ్‌కు, 50 శాతం ప్రైవేటు డీలర్లకు సరఫరా చేస్తున్నట్లు అధికారులు వివరించారు. జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ, ఏవో ప్రసాదరావు, సిబ్బంది పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: ఉమ్మడి జిల్లా ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ పి.శ్రీదేవి శుక్రవారం కలెక్టర్ జి.రాజకుమారి గనియాను మర్యాదపూర్వకంగా కలిశారు. త్వరలో అమలు కాబోయే నూతన మద్యం విధానం గురించి కలెక్టర్‌కు డీసీ తెలిపారు. రాబోయే రోజుల్లో ప్రభుత్వం చేపట్టబోయే నవోదయం కార్యక్రమాల్లో భాగంగా నాటుసారా, డ్రగ్స్, అక్రమ మద్యం నిర్మూలన లాంటి వాటి గురించి వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బనగానపల్లి ప్రాంతంలో నాటుసారా తయారీ ఎక్కువగా ఉందని చెబుతూ అరికట్టాలన్నారు. కార్యక్రమంలో కర్నూలు జిల్లా ఎక్సైజ్ శాఖ సహాయ కమిషనర్ పత్తిపాటి హనుమంతరావు, జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన ఈఈ

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: నంద్యాల పంచాయతీరాజ్ ఈఈ, డీపీఆర్వో కె.నాగరాజు రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ.ఫరూక్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. శుక్రవారం బాధ్యతలు చేపట్టిన అనంతరం మంత్రిని ఆయన కార్యాలయంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. సీనియర్ అసిస్టెంట్ బి.వెంకటసుబ్బయ్య, తులసీరెడ్డి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

చట్టవ్యతిరేక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి ఉంచండి

నంద్యాల నేరవిభాగం, న్యూస్‌టుడే: మట్కా, జూదం, అక్రమ మద్యం రవాణాపై ముందస్తు సమాచారం సేకరించి వాటిని అరికట్టేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆత్మకూరు సబ్ డివిజన్‌కు సంబంధించిన నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పోలీస్‌స్టేషన్ల వారీగా పెండింగ్ కేసులు, వాటి స్థితిగతులు, నమోదైన కేసుల్లో నిందితుల అరెస్టు, కేసుల దర్యాప్తు తదితరాల గురించి ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నమోదైన కేసుల్లో సమగ్ర దర్యాప్తు నిర్వహించి నేరస్థులు తప్పించుకునే అవకాశం లేకుండా న్యాయ స్థానాల్లో తగిన సాక్ష్యాధారాలు ప్రవేశపెట్టి శిక్షపడే విధంగా ఆధారాలు సేకరించాలన్నారు. రౌడీషీటర్ల కదలికలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఆత్మకూరు డీఎస్పీ రామాంజీనాయక్, సీఐలు మోహన్‌రెడ్డి, విజయభాస్కర్, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.



22 అడుగుల జొన్నచెట్టు

బేతంచెర్ల పట్టణంలోని శ్రీనగర్ కాలనీకి చెందిన భజన కృష్ణయ్య తన ఇంటి ముందర వేసిన జొన్న మొక్క ఏపుగా పెరిగింది. సాధారణంగా జొన్న పైరు 7 నుంచి 8 అడుగులు మాత్రమే పెరుగుతుంది. కానీ ఈ మొక్క ఏకంగా 22 అడుగుల ఎత్తుకు పెరగడంతో పట్టణ ప్రజలు ఆశ్చర్యంగా తిలకిస్తున్నారు. **- న్యూస్‌టుడే, బేతంచెర్ల**

ట్రాక్టరు బోల్తా పడి యువకుడి దుర్మరణం

చాగలమర్రి న్యూస్‌టుడే : మండలంలోని ఓజి. తండా గ్రామానికి చెందిన యువకుడు శ్రీనివాస్‌నాయక్ (19) ప్రమాదవశాత్తు ట్రాక్టరు బోల్తాపడటంతో మృతి చెందిన ఘటన శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం వస్త్రాంనాయక్, లాలీబాయి దంపతుల కుమారుడైన శ్రీనివాస్‌నాయక్ నంద్యాలలోని ఓ కళాశాలలో డిగ్రీ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. తమ సొంత పొలంలోని మొక్కజొన్న గింజలను శ్రీనివాస్‌నాయక్ ట్రాక్టరులో ముత్యాలపాడుకు తరలిస్తుండగా చెరువు సమీపంలో ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తాపడింది. దీంతో శ్రీనివాస్‌నాయక్ అక్కడికక్కడే మృతి చెందగా మరో మహిళ ధనికాబాయి తీవ్రంగా గాయపడింది. గాయపడిన మహిళను ఆళ్లగడ్డ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు.

హత్యకేసులో మరో నిందితుడి అరెస్ట్

మహానంది, న్యూస్‌టుడే: మహానంది మండలం సీతారామాపురం గ్రామంలోని పసుపులేటి పెద్దసుబ్బరాయుడు దారుణ హత్య కేసుకు సంబంధించి నంద్యాలపట్టణ శివారులోని నందమూరినగర్‌కు చెందిన షేక్ ఇర్ఫాన్ ఆలియాస్ షేక్షావలిని అరెస్ట్‌చేసి రిమాండుకు పంపించినట్లు నంద్యాల గ్రామీణ సర్కిల్ సీఐ శ్రీనివాసరెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయనను అదుపులోకి తీసుకొని అరెస్ట్ చేశామన్నారు. ఈ ఏడాది ఆగస్టు 3న అర్ధరాత్రి తర్వాత జరిగిన హత్య కేసులో మొత్తం 26 మందిపై బాధితులు ఫిర్యాదు చేయగా ఇప్పటి వరకు 25 మందిని అరెస్ట్ చేశామని, మరొకరి కోసం గాలిస్తున్నామని చెప్పారు.

కాలువలో పడి వ్యక్తి మృతి

కొలిమిగుండ్ల, న్యూస్‌టుడే : మండలంలోని బెలుం శింగవరం గ్రామానికి సమీపంలోగల గాలేరు నగరి సుజల స్రవంతి కాలువలో పడి నాగన్న (40)మృతి చెందినట్లు సీఐ రమేశ్‌బాబు శుక్రవారం తెలిపారు. సీఐ వివరాల ప్రకారం మండలంలోని వెలగటూరు గ్రామానికి చెందిన నాగన్న, మరో ఆరు మంది చేపలు పట్టడానికి బెలుం శింగవరం గ్రామానికి వచ్చారు. ప్రమాదవశత్తు కాలువలో పడి నాగన్న మృతిచెందారు. మృతదేహాన్ని పంచనామా నిమిత్తం అవుకు వైద్యశాలకు తరలించారు.

నంద్యాల

•నంద్యాల •నందికొట్కూరు •శ్రీశైలం •పాణ్యం

ఎస్సార్సీసీ కాలనీలో తాగునీటి సమస్య

పాణ్యం గ్రామీణం, న్యూస్‌టుడే: పాణ్యంలోని ఎస్సార్సీసీ కాలనీలో నాలుగు రోజులుగా తాగునీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నామని కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాలనీకి నీరందించే మోటారు బిగ కాలిపోవడంతో సమస్య ఏర్పడిందన్నారు. ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లామని ఈఓ వేణుగోపాల్ తెలిపారు. త్వరగా ఏర్పాట్లు చేసి కాలనీకి నీరు అందిస్తామన్నారు.

ప్రాయశ్చిత్త హోమంలో పాల్గొనండి

నంద్యాల పాతపట్టణం, గాంధీచౌక్, న్యూస్‌టుడే: తిరుపతి లడ్డూ తయారీలో జరిగిన కల్తీపై అపచార దోష నివారణకు శనివారం పట్టణంలోని కోదండ రామాలయంలో భగవత్ సేవా సమాజ్ ఆధ్వర్యంలో నిర్వహించే ప్రాయశ్చిత్త హోమంలో భక్తులు పాల్గొనాలని భగవత్ సేవా సమాజ్ అధ్యక్షుడు సూరయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సర్వశాంతి సంప్రోక్షణ, సుదర్శన ప్రాయశ్చిత్త శాంతి హోమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

రైతులకు నీరందించాలి

జూపాడుబంగ్లా, న్యూస్‌టుడే: మండలంలో కేసీ ఆయకట్టు రైతులకు నీరందించాలని కేసీ కాలువ ఈఈ ప్రతాప్‌ను తెదేపా మండల కన్వీనరు వెంకటేశ్వర్లు యాదవ్ కోరారు. శుక్రవారం ఈఈ కార్యాలయంలో ఆయన్ని మర్యాదపూర్వకంగా కలిశారు. కేసీ ఆయకట్టు రైతులకు ఇబ్బందులు లేకుండా నీరందించాలన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM)
నందికొట్కూరు : 94403 61729
ఆత్మకూరు : 90149 09024
నంద్యాల : 98853 28120

నంద్యాల పాతపట్టణం: సమస్య: ఎన్జీవో కాలనీలో రోడ్డును నిర్మించి రాళ్లను, వ్యర్థాలను వదిలేయడంతో ఇబ్బందులు కలుగుతున్నాయి.
-జనార్దన్‌శెట్టి, విశ్రాంత తహసీల్దార్.
సమాధానం: వ్యర్థాలు తొలగిస్తాం.
-నిరంజన్‌రెడ్డి, పురపాలక కమిషనర్.

తిరగని ఫ్యాన్లు

◆ ఆర్టీసీ ప్రాంగణాల్లో సమస్యలు చెప్పిన ప్రయాణికులు
◆ పరిష్కరిస్తామన్న అధికారులు
◆ 'మేమున్నాం..మీకుతోడుగా'కు స్పందన

అధ్వానంగా మరుగుదొడ్లు

నంద్యాల, నందికొట్కూరు, ఆత్మకూరు ఆర్టీసీ డిపోల పరిధిలో పలు సమస్యలు ప్రయాణికులను వేధిస్తున్నాయి. బస్సులు సరిగా నడవకపోవడం, అధికారులతో వ్యాపారులు ప్రయాణికులను దోచుకోవడం, వేళకు బస్సులు లేక బడులకు విద్యార్థులు వెళ్లలేక ఇబ్బందులుపడుతుండటంపై 'ఈనాడు' 'మేమున్నాం...మీకు తోడుగా' పిలుపునకు పలువురు సమస్యల్ని తెలియజేశారు. వాటిని ఆయా డిపోల అధికారుల దృష్టికి తీసుకెళ్లగా ఇలా స్పందించారు. -న్యూస్‌టుడే, నంద్యాల, నందికొట్కూరు, ఆత్మకూరు

ప్రయాణికులకు తప్పని తిప్పలు

నందికొట్కూరు, న్యూస్‌టుడే:
సమస్య: ప్రయాణికులు తాగేందుకు ఆత్మకూరు బస్సులు నిలిచే వద్ద ఉన్న ట్యాంకులో మంచి నీరు లేదు. మినరల్ వాటరు కొనాలంటే 250 ఎం.ఎల్ రూ.10కు విక్రయిస్తున్నారు. **- రహీమాన్, ప్రయాణికుడు.**
సమాధానం: మంచి నీటి సదుపాయం కల్పిస్తాం.


అలంకార ప్రాయంగా ఉన్న మంచి నీటి ట్యాంకు

సమస్య: ప్రాంగణంలో ఫ్యాన్లు ఉన్నా తిరగడం లేదు. **-మంజునాథ్, ప్రయాణికుడు.**
సమాధానం: ఫ్యాన్లునిరంతరం తిరిగేలా ఏర్పాట్లు చేయిస్తాను.
సమస్య: బస్సులు ప్రాంగణంలోకి రావాలంటే ఏదైనా వాన వస్తోంది. **-రఘునందన**
సమాధానం: వర్షాల కారణంగా మురుగు నిల్వలు ఉన్నాయి. వాసన రాకుండా చూస్తాం.
సమస్య: ప్రయాణికుల ప్రాంగణంలో దోమలు ఎక్కువయ్యాయి. **-వెంకటరమణ.**
సమాధానం: దోమల వల్ల ఇబ్బంది లేకుండా ఫాగింగ్ చేయిస్తాను.


ప్రాంగణంలో తిరగని ఫ్యాన్లు

సమస్య: మరుగుదొడ్ల శుభ్రత లేక దుర్వాసన వస్తున్నాయి. **-మహమ్మద్‌గౌస్.**
సమాధానం: మరుగుదొడ్ల శుభ్రతకు చర్యలు తీసుకుంటాం.
సమస్య: ప్రయాణికులు బస్సులు లేక ఇబ్బంది పడుతున్నారు.
సమాధానం: ప్రయాణికులు, విద్యార్థుల బస్సులు వేరుగా ఉండవు. అందరూ కలిసి ప్రయాణించాలి. ప్రయాణికుల సంఖ్య అధికంగా ఉంటే అదనపు బస్సు వేస్తాం.

పై ప్రశ్నలకు ఆత్మకూరు డిపో మేనేజరు మహేంద్రుడు సమాధానాలిచ్చారు.


నందికొట్కూరు: ప్రాంగణం వద్ద మురుగు

నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే:
సమస్య: ఆర్టీసీ బస్టాండులో సీసీ కెమెరాలు పని చేయడంలేదు. **-రమణ, నంద్యాల**
సమాధానం: బస్టాండులో నాలుగు సీసీ కెమెరాలు కమాండ్ కంట్రోల్ రూంతో అనుసంధానమై ఉన్నాయి. పనిచేయని మిగతా వాటి గురించి ఉన్నతాధికారులకు నివేదిక పంపాం.
సమస్య: బస్టాండులో తాగునీరు ఉప్పగా వస్తోంది. **-నాయుడు, నంద్యాల.**
సమాధానం: పురపాలక నీటిని అందిస్తాం.
సమస్య: మరుగుదొడ్ల వద్ద అధికరేట్లు వసూలు చేస్తున్నారు. **-సుబ్బయ్య, కానాల.**
సమస్య: ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు విక్రయిస్తున్నారు. **-రఘు, మహానంది.**
సమాధానం: అధిక ధరలు వసూలు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం.
సమస్య: ఆర్టీసీ సెక్యూరిటీ కానిస్టేబుళ్లు లోపలికి వచ్చిన బైక్‌లకు చలానాలు రాస్తున్నారు. కానిస్టేబుళ్లు బస్టాండు బయట ఉండేలా చూడండి. **-కిశోర్, నంద్యాల.**
సమాధానం: రాంగ్ రూట్‌లో వస్తే చలానాలు విధిస్తున్నారు.
సమస్య: ప్రాంగణంలో అపరిశుభ్రత అధికంగా ఉంది. **-సుజాత, అయ్యలూరు.**
సమాధానం: ప్రాంగణాన్ని పరిశుభ్రంగా ఉంచుతాం.
సమస్య: పల్లెవెలుగు బస్సుల కిటికీలు ఊగుతూ అధికంగా శబ్దం చేస్తున్నాయి. **-సాయి, పాములపాడు.**
సమాధానం: బస్సుల్లో పాడైన కిటికీలను తొలగించి కొత్తవి ఏర్పాటు చేస్తాం.
సమస్య: విద్యార్థి బస్సుల్లో రద్దీ ఎక్కువగా ఉంటోంది. **-సురేష్, విద్యార్థి.**
సమాధానం: నూతన విద్యార్థి బస్సును ఏర్పాటు చేస్తాం.

పై సమస్యలకు నంద్యాల ఆర్టీసీ డిపో మేనేజర్ గంగాధర రావు సమాధానం ఇచ్చారు.


నో పార్కింగు వద్ద ద్విచక్ర వాహనాల నిలుపుదల

సమస్య: ఆత్మకూరు ప్రయాణికుల ప్రాంగణంలో నో పార్కింగు వద్ద, ప్రవేశమార్గం, క్యాంటిన్ వద్ద ద్విచక్ర వాహనాలు నిలుపుతున్నారు. **-ఆంజనేయులు.**
సమాధానం: సమస్యను గుర్తించాం. చర్యలు తీసుకుంటాం.
సమస్య: అద్దె బస్సుల డ్రైవర్లు పాములపాడు, ఎర్రగూడూరు గ్రామాల్లో కొన్నిసార్లు చేతులెత్తినా బస్సులు ఆపడం లేదు. **-రాజశేఖర్, పాములపాడు.**
సమాధానం: బస్సులు ఆపకపోతే 9959225801 నంబరుకు ఫిర్యాదు చేయండి.
సమస్య: మరుగుదొడ్లు కొన్ని బాగోలేవు. **-సుబ్బయ్య, ప్రయాణికుడు.**
సమాధానం: కొన్నిచోట్ల వాల్వులు పని చేయడం లేదు. మరమ్మతులు చేయాలని ఇంజినీరింగ్ విభాగానికి సూచించాం.
సమస్య: పాఠశాల, కళాశాలలు వదిలిన సమయంలో ఆకతాయిలు అల్లరి చేస్తూ విద్యార్థినులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. **-నరసింహులు, విద్యార్థిని తండ్రి.**
సమాధానం: సిబ్బంది హెచ్చరిస్తూనే ఉన్నారు. కానిస్టేబుళ్లను నియమించాలని పోలీసులను కోరతాం.
సమస్య: క్యాంటీన్‌లో చేతులు శుభ్రం చేసుకునే ప్రదేశం అపరిశుభ్రంగా ఉంది. **-రాజేష్.**
సమాధానం: వెంటనే చర్యలు తీసుకుంటాం.
సమస్య: నంద్యాల మలుపులో బస్ షెల్టర్ నిరుపయోగంగా ఉంది. **-రబ్బానీ, ప్రయాణికుడు.**
సమాధానం: చర్యలు తీసుకుంటాం.

పై ప్రశ్నలకు డిపో మేనేజర్ మహేంద్రుడు సమాధానాలిచ్చారు

యువకుడికి జైలు

బండిఆత్మకూరు, న్యూస్‌టుడే: బి.కోడూరుకు చెందిన ఈశ్వర్ మద్యం మత్తులో భయభ్రాంతులకు గురి చేశాడనే నేరం రుజువవ్వడంతో నంద్యాల రెండో తరగతి న్యాయమూర్తి ఆయనకు అయిదు రోజుల జైలు శిక్ష విధించినట్లు ఎస్సై జగన్మోహన్ శుక్రవారం తెలిపారు. యువకుడ్ని రిమాండుకు తరలించామన్నారు.

పల్లె కబుర్లు

వెలుగోడు: పట్టణంలో రైతు సంఘం, ఆవాజ్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. వందమందికి కంటివైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. పదిమందికి కంటి శుక్లం శస్త్ర చికిత్సకు రిఫర్ చేసినట్లు వైద్యులు భరత్, స్వాతి తెలిపారు.

వెలుగోడు: పట్టణంలోని సీపీనగర్‌లో మూడు రోజుల నుంచి వీధి దీపాలు వెలగడంలేదని కాలనీ వాసులు తెలిపారు.

అబ్దుల్లాపురం(వెలుగోడు): అబ్దుల్లాపురం గ్రామంలోని బస్టాండ్ ఆవరణంలో ఆక్రమించిన స్థలాలపై చర్యలు తీసుకుంటామని తహసీల్దారు శ్రీనివాసగౌడ్ తెలిపారు.

వెలుగోడు: వెలుగోడుతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించామని ఎంపీడీవో అమానుల్లా తెలిపారు

గడివేముల: మిడ్తూరు మండలం వీపనగండ్లకు చెందిన మహేష్, భార్య నాగమణి, 3 ఏళ్ల కుమారుడు జగదీష్ బిలకలగూడూరులో ఓ కార్యక్రమానికి శుక్రవారం ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఢీ కొట్టింది. నాగమణి, కుమారుడు జగదీష్‌కు గాయాలయ్యాయి.

దోషులను శిక్షించాలని కోరుతూ ప్రదర్శన

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: తిరుమల లడ్డూ ప్రసాదాన్ని అపవిత్రం చేసిన దోషులను వెంటనే శిక్షించాలని కోరుతూ జిల్లా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ప్రదర్శన నిర్వహించారు. శుక్రవారం సాయంత్రం జిల్లా వాసవి సేవాదళ్ అధ్యక్షులు బింగుమళ్ల శ్యామ్‌సుందర్ గుప్త, జిల్లా ఆర్యవైశ్య సంఘం గౌరవాధ్యక్షులు కండె శ్యామ్‌సుందర్‌లాల్, బన్నూరు మోహన్‌ల ఆధ్వర్యంలో స్థానిక గాంధీచౌక్ నుంచి


ప్రదర్శనలో ఆర్యవైశ్యులు

శ్రీనివాససెంటర్ వరకు ఈ మేరకు ప్లకార్డులతో, కొవ్వొత్తులతో ప్రదర్శన నిర్వహించారు. రిటైల్ మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షులు మల్లికార్జున, ప్రధాన కార్యదర్శి ప్రసాద్, కోశాధికారి గెల్వి శేఖర్, జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు భవనాశి మహేశ్, భాజపా పట్టణ అధ్యక్షులు చంద్రశేఖర్, ఆయూష్ యోగా నిర్వాహకులు ఆనంద్ గూరాజీ, మండి మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షులు కృష్ణాంజనేయులు, వివిధ సంఘాల నాయకులు ప్రసాద్, నారాయణ, శ్రీకాంత్, నాగరాజు, రమేశ్, వాసు, రామశేషు తదితరులు పాల్గొన్నారు.

నానో ఎరువులపై అవగాహన పెరగాలి

నంద్యాల వ్యవసాయం, న్యూస్‌టుడే: పంట సాగులో నానో ఎరువుల వినియోగంపై అవగాహన పెరగాలని జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ అన్నారు. శుక్రవారం నంద్యాలలోని జిల్లా వ్యవసాయ శిక్షణ కేంద్రం పరిధిలో సాగు చేస్తున్న వరి పంటకు నానో డీఏపీని డ్రోన్ ద్వారా పిచికారీ చేశారు. నానో డీఏపీ, నానో యూరియాతో రైతులకు పెట్టుబడి భారం తగ్గుతుందన్నారు. డ్రోన్ వినియోగంతో తక్కువ సమయంలో ఎక్కువ విస్తీర్ణంలో మందులను పిచికారీ చేయొచ్చన్నారు.

మహానందీశునికి ఘనంగా పల్లకి సేవోత్సవం


మహానంది, న్యూస్‌టుడే: మహానంది పుణ్య క్షేత్రంలో శుక్రవారం రాత్రి గంగా కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వర స్వామివార్లకు దేవ


పల్లకి ఉత్సవంలో హారతి ఇస్తున్న అర్చకులు

స్థానం ఆధ్వర్యాన పల్లకిసేవోత్సవం ఘనంగా నిర్వహించారు. వేదపండితులు శాంతారామ్ భట్, ఆంజనేయశర్మ, అర్చకులు బెక్కెం శరభయ్య పూజలు నిర్వహించారు. పలు ప్రాంతాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

గోజాతి సంరక్షణతో సంపదల సిద్ధి

బండిఆత్మకూరు, న్యూస్‌టుడే: గోసేవే గోవిందుడి సేవ అని, గోజాతి సంరక్షణతో సమస్త సంపదలు సిద్ధిస్తాయని తితిదే హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా కార్యనిర్వాహకుడు మల్లు వెంకటరెడ్డి అన్నారు. స్థానిక లక్ష్మీ జనార్దన స్వామి ఆలయంలో


బండిఆత్మకూరు: గోమాతకు పూజలు నిర్వహిస్తున్న గ్రామస్థులు

నాలుగు రోజులుగా జరుగుతున్న ధార్మిక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు శుక్రవారం ముగిశాయి. ధర్మప్రచార మండలి సభ్యురాలు గుండా సునీత, ఆలయ కమిటీ సభ్యులు బైరెడ్డి లక్ష్మీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైకాపా నాయకులకు తాఖీదులు

గడివేముల, న్యూస్‌టుడే: మండలంలోని వైకాపా నాయకులకు పోలీసులు తాఖీదులు అందించారు. మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి 27న తిరుమలకు వెళ్తున్నారని, ఈనెల 27 నుంచి అక్టోబరు 24 వరకు పోలీస్‌యాక్టు అమలులో ఉంటుందని తెలిపారు. శాంతి భద్రతల దృష్ట్యా మాజీ ముఖ్యమంత్రికి మద్దతుగా తిరుపతి, తిరుమలకు వెళ్లేందుకు అనుమతులు లేవన్నారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పంచాయతీల్లో గ్రామసభలు

గడివేముల, న్యూస్‌టుడే: గ్రామపంచాయతీల్లో శుక్రవారం గ్రామసభలు నిర్వహించారు. స్వచ్ఛతాహీసేవ కార్యక్రమంలో భాగంగా గ్రామసభలు నిర్వహించి పలు సమస్యలపై చర్చించారు. బిలకలగూడూరు గ్రామంలో సర్పంచి గైర్హాజరైనా గ్రామసభ నిర్వహించారు.

పంటలకు బీమా ప్రకటించాలి

వెలుగోడు, న్యూస్‌టుడే: 2023 ఖరీఫ్, రబీ సీజన్‌లో పంటలు సాగు చేసి నష్టపోయిన రైతులకు వెంటనే బీమా పరిహారాన్ని ప్రకటించాలని ఏపీ రైతు సంఘం అధ్యక్షుడు రాజశేఖర్, మాజీ ఎంపీపీ ఎల్లాల కృష్ణ డిమాండు చేశారు. శుక్రవారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో రీసర్వే డీటీ ఆంజనేయులుకు వినతి పత్రం అందజేశారు. మహమ్మద్ రఫీ, యాదాటి రవి తదితరులు పాల్గొన్నారు.

జగనన్నకాలనీలో సమస్యలు పరిష్కరించాలి

నందికొట్కూరు, న్యూస్‌టుడే : నందికొట్కూరు పురపాలక పరిధిలోని జగనన్న కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఏపీ రైతు సంఘం నాయకుడు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. శుక్రవారం జగనన్న కాలనీలో పర్యటించారు. పురపాలక అధికారులు స్పందించి కాలనీలో సమస్య పరిష్కరించాలని కోరారు.

దివ్యాంగులకు సౌకర్యాలు కల్పించాలి

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: దివ్యాంగులకు సౌకర్యాలు కల్పించకపోవడం దురదృష్టకరమని తెదేపా యువ నాయకుడు ఎన్‌ఎండీ. ఫయాజ్ పేర్కొన్నారు. చైల్డ్ రైట్స్ జాయింట్ యాక్షన్ కమిటీ ల్యాంప్ సహకారంతో స్థానిక నందమూరినగర్ మండల పరిషత్ పాఠశాలలో దళిత సంక్షేమ సంఘం సొసైటీ సంచాలకుడు ఎస్.శ్యామూల్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రతిభావంతుల హక్కులపై అవగాహన సదస్సు శుక్రవారం నిర్వహించారు.

గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు

పాణ్యం గ్రామీణం, న్యూస్‌టుడే: గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు ఎంపీడీవో దస్తగిరి అన్నారు. శుక్రవారం మండలంలోని అన్ని గ్రామాల్లో స్వర్ణాంధ్ర విజన్ 2047పై గ్రామసభ నిర్వహించారు. ప్రణాళిక కరపత్రాలను ప్రజలకు అందజేశారు. తమ్మరాజుపల్లెలో చెత్త సంపద కేంద్రాలను సర్పంచి విజయభార్గవి, తెదేపా నాయకులు, అధికారులు ప్రారంభించారు.


చెత్త సంపద కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సర్పంచి విజయభార్గవి, తెదేపా నాయకులు

చెంచు మహిళ ప్రసవంపై విచారణ

కొత్తపల్లి, న్యూస్‌టుడే: చెంచు మహిళ ఆసుపత్రి మెట్లపైనే ప్రసవించడంపై డిప్యూటీ డీఎంహెచ్‌వో కాంతరావు శుక్రవారం విచారణ చేపట్టారు. కొత్తపల్లిలోని చెంచుగూడేనికి చేరుకుని బాధిత మహిళ, కుటుంబీకులతో ప్రసవంపై ఆరా తీశారు. నివేదికను ఉన్నత అధికారులకు అందించి తదుపరి చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

సమతుల ఆహారాన్ని తీసుకోవాలి: కలెక్టర్

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరూ సమతుల ఆహారం తీసుకుని ఆరోగ్యంగా ఉండాలని కలెక్టర్ జి.రాజకుమారి పేర్కొన్నారు. స్థానిక సెయింట్ జోసెఫ్ పాఠశాలలో జాతీయ పోషణ మాసోత్సవాల్లో శుక్రవారం


మాట్లాడుతున్న రాజకుమారి

ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. విద్యార్థులు శారీరక, మానసిక ఎదుగుల కోసం పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. ఐసీడీఎస్ పీడీ లీలావతి, సీడీపీవోలు తదితరులు పాల్గొన్నారు.

శాంతి భద్రతలకు ఆటంకం కలిగిస్తే చర్యలు

నందికొట్కూరు, న్యూస్‌టుడే: గ్రామంలో శాంతి భద్రతలకు ఆటంకం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని ఆత్మకూరు డీఎస్పీ రామాంజి నాయక్ హెచ్చరించారు. శుక్రవారం మిడుతూరు మండలం పీరుసాహెబ్‌పేట గ్రామస్థులను నందికొట్కూరు సర్కిల్ కార్యాలయానికి పిలిచి మాట్లాడారు. శాంతి వాతావరణం ఉండేలా చూడాలన్నారు.

నంద్యాల నేరవిభాగం, న్యూస్‌టుడే: నంద్యాల పట్టణంలో వాహనాల సంఖ్య పెరగడం వల్ల ట్రాఫిక్ సమస్యలు వస్తున్నాయని, వాటిని నియంత్రించాలంటే ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, లేకపోతే జరిమానాతో పాటు కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ మల్లికార్జున గుప్తా హెచ్చరించారు. శుక్రవారం రామకృష్ణ డిగ్రీ కళాశాలలోని వివేకానంద ఆడిటోరియంలో బడిబస్సు డ్రైవర్లకు, ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించారు.

ఈఈగా బాధ్యతల స్వీకరణ

శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే: శ్రీశైల దేవస్థానం కార్యనిర్వాహక ఇంజినీర్(ఈఈ)గా ఎం.నరసింహారెడ్డి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన అన్నవరం దేవస్థానం నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు.

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: నంద్యాల పురపాలక ఎంఈ కె.గురప్ప యాదవ్, డీఈ నాగభూషణ్‌రెడ్డి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం మున్సిపల్ ఛైర్‌పర్సన్ మాబున్నిసా, కమిషనర్ నిరంజన్‌రెడ్డిలను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

ఆత్మకూరు, న్యూస్‌టుడే: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోను రాణించాలని ఆర్డీవో మిరియాల దాసు అన్నారు. ఆత్మకూరు ప్రభుత్వ బాలురోన్నత పాఠశాల మైదానంలో శుక్రవారం ఎస్‌జీఎఫ్ నియోజక వర్గ స్థాయి క్రీడా పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు.

బండిఆత్మకూరు, న్యూస్‌టుడే: బండిఆత్మకూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థిని లక్ష్మి హాకీలో సత్తా చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు శుక్రవారం ప్రిన్సిపల్ వెంకటనారాయణ తెలిపారు. కళాశాల గణిత ఉపాధ్యాయుడు రామసుబ్బారెడ్డి విద్యార్థినిని అభినందించారు.

నంద్యాల పాతపట్టణం, న్యూస్‌టుడే: నంద్యాలకు చెందిన క్రీడాకారులు అమీర్‌బాషా, సఖియా, ఏడుకొండలు జిల్లా స్థాయి కరాటే పోటీల్లో ప్రతిభ సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఐఎంఏ జాతీయ కేంద్ర వర్కింగ్ కమిటీ సభ్యుడు డా.రవికృష్ణ తెలిపారు. శుక్రవారం స్థానిక కళారాధన కార్యాలయంలో అభినందించారు.

సీఎస్ఆర్ నిధికి రూ.6 లక్షలు అందజేత

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: కార్పొరేట్ సామాజిక బాధ్యత నిధికి రెయిన్ సిమెంట్ లిమెటెడ్ రూ.6 లక్షలు అందజేసింది. శుక్రవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ జి.రాజకుమారిని కలిసి సంస్థ డిప్యూటీ జనరల్ మేనేజర్ ఆనంద్ భాస్కర్ ఈ మొత్తాన్ని చెక్కు రూపంలో అందజేశారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే: పిన్నాపురంలో సోలార్ కంపెనీ యాజమాన్యం రైతుల చేతికొచ్చిన పంటలను నాశనం చేస్తోందని, వెంటనే ప్రభుత్వం ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ డిమాండు చేశారు. శుక్రవారం జిల్లా ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో మల్లికార్జునరెడ్డిని కలిసి రైతుసంఘం నాయకులు వినతిపత్రం అందజేశారు.

ఫాసిస్టు దాడులకు వ్యతిరేకంగా పోరాటం

నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే: దేశంలో ఫాసిస్టు దాడులకు వ్యతిరేకంగా పోరాడుదామని సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి నాగరాజు అన్నారు. శుక్రవారం ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ పార్టీ కేంద్ర కమిటీ పిలుపు మేరకు సత్యశోధక్ సమాజ్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆ పార్టీ నాయకులు నిర్వహించారు.

విద్యాలయం.. సమస్యలవలయం

పాణ్యం, పాణ్యం గ్రామీణం, న్యూస్‌టుడే: నెరవాడ మెట్ట వద్ద ఉన్న ఏపీ గిరిజన మినీ గురుకుల పాఠశాలలో వసతులు లేక విద్యార్థులు ఇబ్బందులుపడుతున్నారు. పాఠశాలలో 1 నుంచి 7వ తరగతి వరకు 125 మంది ఉన్నారు. కర్నూలు-కడప జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా పాఠశాలకు చెందిన వంట గది, భోజనశాల, 10 స్నానపు గదులు, 10 మరుగుదొడ్లను తొలగించడంతో పాటు పాఠశాలకు నీరందించే బోరు పోయింది. ప్రధాన గిరిజన గురుకుల పాఠశాలలో మినీ గురుకులాన్ని నిర్వహించారు. అనంతరం 2021లో మిగిలి ఉన్న భవనాల్లోకి పాఠశాలను మార్చారు.


పరిసరాల్లో పెరిగిన కంపచెట్లు


బురదమయమైన పరిసరాలు

తరగతి గదుల్లోనే నిద్ర

తరగతులను వరండాలోనే నిర్వహిస్తూ కాలం వెళ్లదీస్తున్నారు. భోజనాల అనంతరం భోజనశాల గదిని 3వ తరగతికి వినియోగిస్తున్నారు. ఒక డార్మిటరీ గదిలోని మంచాలపైన విద్యార్థులు ట్రంకు పెట్టెలు, వస్తువులు ఉంచుతున్నారు. మరో గదిలో మంచాలు, వస్తువులు ఉండటంతో విద్యార్థులు తరగతి గదుల్లోనే రాత్రిళ్లు నిద్రపోవాల్సి వస్తోందని వాపోతున్నారు. రాత్రిళ్లు మరుగుదొడ్లకు ఇబ్బందులుపడుతున్నారు. పాఠశాలకు బోరు లేకపోవడంతో నీటికి అవస్థలు పడుతున్నామని, పక్కనే ఉన్న ప్రధాన గురుకుల పాఠశాల నుంచి పైపులు వేసుకుని ప్రస్తుతానికి నీటిని వాడుకుంటున్నామని చెబుతున్నారు. కంపచెట్లు, పిచ్చిమొక్కలు పెరగడంతో పాటు వర్షం కురిస్తే పరిసరాలు బురదగా మారుతాయని చెబుతున్నారు. ఎస్సార్సీసీ పంట కాల్వ ఉండటంతో పెద్ద ఎత్తున జమ్ము, పిచ్చి మొక్కలు పెరిగి చిట్టడివిలా మారింది.

అధికారులకు నివేదిస్తున్నాం -మాధవి, ప్రిన్సిపల్

గత నెలలో వంట సామగ్రి వచ్చింది. 1 నుంచి 4వ తరగతి వరకు విద్యార్థులు తరగతి గదుల్లోనే నిద్రపోతున్నారు. తరగతి గదినే భోజనశాలగా ఉపయోగిస్తున్నాం. నీటి సరఫరా లేక ఇబ్బందులు పడుతున్నాం. సొంత డబ్బులు వెచ్చించి లైట్లు, ఫ్యాన్ల మరమ్మతులు చేయించుకుంటున్నాం. వర్షం పడితే భయంగా ఉంటుంది. విషపురుగులు సంచరిస్తుండటంతో గదుల నుంచి రాత్రిళ్లు బయటకు రాలేక పోతున్నాం. ప్రహరీ నిర్మాణంతో పాటు బోరు వేసి నీటి సౌకర్యం కల్పించాలి. ఇక్కడి సమస్యలు ఉన్నతాధికారులకు నివేదిస్తున్నాం.

ఆళ్లగడ్డ

• ఆళ్లగడ్డ • బనగానపల్లి • డోన్


పాత, కొత్త ఈవోలను సన్మానిస్తున్న ఆలయ సిబ్బంది

ఈవోగా బాధ్యతల స్వీకరణ

బనగానపల్లి గ్రామీణం న్యూస్‌టుడే : మండల పరిధిలోని ప్రముఖ పుణ్యక్షేత్రం అయిన యాగంటి ఉమామహేశ్వరస్వామి ఆలయ నూతన ఈవోగా డీఆర్‌కేవీ ప్రసాద్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. కాల్వబుగ్గ నుంచి యాగంటికి బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న ఈవో చంద్రశేఖర్‌రెడ్డి ఓర్వకల్లు గ్రూపు టెంపుల్ అధికారిగా బదిలీపై వెళ్లారు. శుక్రవారం పాత, కొత్త ఈవోలను ఆలయ సిబ్బంది సత్కరించారు.

విద్యుత్తు సరఫరాలో అంతరాయం

ప్యాపిలి, న్యూస్‌టుడే : గుత్తి 220-132 కేవీ ఉపవిద్యుత్ కేంద్రంలో మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏఈ వినయ్‌కుమార్ శుక్రవారం తెలిపారు. ప్యాపిలి, పోదొడ్డి, పెద్దపూదెళ్ల ఉపవిద్యుత్ కేంద్రాల పరిధిలోని అన్ని గ్రామాలకు ఉదయం 7.30 నుంచి 9.30 గంటల వరకు అంతరాయం ఉంటుందన్నారు. రైతులకు ఇచ్చే విద్యుత్తు ఉదయం 9.30 గంటల నుంచి ఇవ్వడం జరుగుతుందని ఆయన తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM)
ఆళ్లగడ్డ: 8008 574916
డోన్ పట్టణం: 94408 57790
బనగానపల్లె: 80085 73763

శిరివెళ్ల : **సమస్య :** మండలంలోని శిరివెళ్ల తెలుగుపేట కాలనీలో అపరిశుభ్రతను తొలగించాలి.
– సుబ్బయ్య.
సమాధానం : సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటాం. – నాగేంద్రుడు ఈవోపీఆర్డీ. శిరివెళ్ల.

నేడు మండల సర్వ సభ్య సమావేశం

బనగానపల్లి, న్యూస్‌టుడే : బనగానపల్లి మండల సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో నాగరాజు శుక్రవారం తెలిపారు. ఉదయం 10 గంటలకు ప్రజాప్రతినిధులు, అధికారులు తప్పకుండా హాజరు కావాలన్నారు. సమావేశానికి రాష్ట్ర మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి హాజరవుతారన్నారు.

సస్యరక్షణతో తెగుళ్ల నివారణ సాధ్యం

ఆళ్లగడ్డ గ్రామీణం, న్యూస్‌టుడే : పంటలకు సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టడంతో తెగుళ్ల నివారణ సాధ్యపడుతుందని నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ప్రిన్సిపల్ శాస్త్రవేత్త రామకృష్ణరావు పేర్కొన్నారు. పట్టణంలోని మహాలక్ష్మీ ఫంక్షన్‌హాల్‌లో


మాట్లాడుతున్న ప్రిన్సిపల్ శాస్త్రవేత్త రామకృష్ణరావు

జిల్లా వనరుల కేంద్రం ఆధ్వర్యంలో రైతు సేవాకేంద్రం సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మొక్కజొన్న, మినుము, వరి, పత్తి పంటలపై తీసుకోవాల్సిన మేలైన యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. పంటలకు సోకే తెగుళ్లు వాటి నివారణ చర్యలపై శాస్త్రవేత్త వెంకటరమణమ్మ వివరించారు. జిల్లా వనరుల కేంద్రం ఏవో ప్రభావతమ్మ, ఆళ్లగడ్డ ఏడీఏ రామ్మోహన్‌రెడ్డి, ఏవో కిశోర్‌కుమార్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సిబ్బంది లేక ఇబ్బంది

బేతంచెర్ల న్యూస్‌టుడే: బేతంచెర్ల 2020 జనవరి 28న మేజర్ పంచాయతీ నుంచి నగర పంచాయతీగా మారింది. అప్పటినుంచి నేటి వరకు అంతా డిప్యూటేషన్, ఇన్‌ఛార్జీ అధికారులతోనే పాలన సాగుతోంది. ఇప్పుడు విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులెవరూ రెగ్యూలర్‌గా విధులు నిర్వహించడం లేదు. నగర పంచాయతీగా మారి ఐదేళ్లు పూర్తి అవుతున్నా నేటికి పూర్తి స్థాయిల్లో సిబ్బంది లేకపోవడతో ప్రజలకు సేవలు సక్రమంగా అందడం లేదు. దీంతో పట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.


ఇరుకు గదిలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది

కీలక శాఖలన్నీ ఖాళీగానే

నగర పంచాయతీలో కీలకమైన శాఖలన్నీ ఖాళీగా ఉండటంతో ప్రజలకు ప్రభుత్వం నుంచి అందే సేవలు సక్రమంగా అందడం లేదు. కీలక శాఖల్లో మున్సిపాల్టీలో ఏఈలు, సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లు, అకౌంటెంట్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, టౌన్ ప్లానింగ్, పారిశుద్ధ్య విభాగాల్లో సిబ్బంది కొరత తీవ్రంగా ఉంది. అధికారులు లేకపోవడంతో ప్రభుత్వం నుంచి వచ్చే లబ్ధి ప్రజలకు చేరడం లేదు. దీంతో ప్రజలు తీవ్రంగా నష్టపోతున్నారు. అదేవిధంగా కాలనీల్లో మౌలిక సధుపాయాల కల్పన సైతం మరుగున పడిపోయింది. పూర్తి స్థాయిల్లో అధికారులను నియమించి నగర పంచాయతీలో ప్రజల సమస్యలను తీర్చాలని స్థానికులు కోరుకుంటున్నారు.

కొత్త పోస్టులు మంజూరు కాలేదు
హరిప్రసాద్ నగర పంచాయతీ కమిషనర్

నగర పంచాయతీ ఏర్పడి ఐదేళ్లు అవుతుంది. ఇప్పటి వరకు డిప్యూటేషన్, ఇన్‌ఛార్జి అధికారులతోనే పాలన జరుగుతుంది. నగర పంచాయతీ నూతన భవన నిర్మాణానికి ఎలాంటి ప్రతిపాధనలు పంపలేదు. ప్రస్తుతం ఉన్న సిబ్బందితోనే ప్రజల సమస్యలను పరిష్కరిస్తాము.

నగర పంచాయతీలో ఖాళీగా ఉన్న పోస్టుల వివరాలు

పోస్టులు	ఖాళీలు
టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్లు	1
టౌన్ ప్లానింగ్ బిల్డింగ్ ఓవర్‌సీస్	1
ట్రేజర్	1
సర్వేయర్	1
వసూలు చేసే రెవెన్యూ ఇన్‌స్పెక్టర్	1
బిల్ కలెక్టర్ పోస్టులు	2
సీనియర్ అసిస్టెంట్లు	4
జూనియర్ అసిస్టెంట్లు	4
టైపిస్టు	1
సిస్టమ్ మేనేజర్	1
సిస్టమ్ అసిస్టెంటు	1
రికార్డు అసిస్టెంటు	1
పారిశుద్ధ్య విభాగంలో	17
ప్రజారోగ్య పరిధిలో	15
డ్రైన్ క్లీనర్‌లు	9
క్యాడ్ ఆపరేటర్‌లు	2
సీనియర్ స్టెనోగ్రాఫర్	2
డ్రాఫ్ట్స్ మెన్	2
కమ్యూనిటీ ఆర్గనైజర్	2

చెన్నకేశవాలయంలో విష్ణుపారాయణం

చాగలమర్రి, న్యూస్‌టుడే : పట్టణంలోని లక్ష్మీచెన్నకేశవాలయంలో శుక్రవారం మహిళలు పెద్దఎత్తున పాల్గొని విష్ణు


ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న అభినవ శంకరానందస్వామి

పారాయణం గావించారు. శివరామానందస్వామి ఆశ్రమ నిర్వాహకులు అభినవ శంకరానందస్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రవచనాలు తెలియజేశారు. అనంతరం భక్తులు ఆలయంలో గోవిందనామాలతో ఏడు సార్లు ప్రదక్షిణలు చేశారు. ఆలయ అధ్యక్షులు బొడ్డు వేణుగోపాల్‌రెడ్డి, లక్ష్మీనరసింహస్వామి ఉత్సవ కమిటీ అధ్యక్షులు గుత్తినరసింహులు, సమరసతసేవా ఫౌండేషన్ జిల్లా కన్వీనర్ సల్లానాగరాజు, హిందూఐక్యసంఘం సభ్యులు శివశంకర్, పాల్గొన్నారు.

సనాతన హిందూధర్మ సంరక్షణ హిందువుల బాధ్యత

డోన్, న్యూస్‌టుడే : హిందూధర్మ పరిరక్షణ అందరి బాధ్యత అని శతావధాని గండ్లూరి దత్తాత్రేయశర్మ, కల్లెశేషావలిశర్మలు అన్నారు. శుక్రవారం స్థానిక గాయత్రీపీఠంలో హిందూధర్మ పరిరక్షణ కోసం తిరుమలలో లడ్డూప్రసాదం అపవిత్రం చేసినందుకు నిరసనగా ఉదయం 9 గంటల నుంచి గాయత్రీ పీఠంలో మహాగణపతి, దత్తాత్రేయస్వామి, శ్రీలక్ష్మినరసింహస్వాములకు ప్రత్యేకమైన అభిషేకాలు నిర్వహించారు.

అటవీ సిబ్బందికి సన్మానం

రుద్రవరం, న్యూస్‌టుడే : స్థానిక అటవీ కార్యాలయంలో బీట్ అధికారుల నుంచి సెక్షన్ అధికారులుగా పదోన్నతులు పొందిన రామకృష్ణ, మాబుఖాన్, విజయవర్ధన్‌లను సన్మానించినట్లు రుద్రవరం సెక్షన్ అధికారి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

స్నేహితుడికి ఆర్థిక సాయం

రుద్రవరం న్యూస్‌టుడే : తువ్వపల్లెకు చెందిన బాలనరసింహుడు కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న విషయాన్ని తెలుసుకున్న 2006-07 బ్యాచ్‌కి చెందిన తోటి స్నేహితులు శుక్రవారం రూ.33 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు.

ఆత్మబంధువుకు అంత్యక్రియలు

డోన్, న్యూస్‌టుడే : వెల్దుర్తి సమీపంలో యాచించుకుంటూ తిరుగుతున్న ఓ గుర్తుతెలియని వ్యక్తి మరణించగా, శుక్రవారం డోన్‌లోని వాసవిమిత్ర సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు.

కష్టాల్లో ఉన్న వారిని ఆదుకోవాలి

డోన్, న్యూస్‌టుడే : స్థానిక రోటరీ క్లబ్ కార్యాలయంలో శుక్రవారం విజయవాడ వరద బాధితులకు రూ.10వేలు అందించిన దాత వెంకటరాముడును రోటరీ ఆధ్వర్యంలో జగన్‌మోహన్, సత్యనారాయణరెడ్డి సన్మానం చేశారు.

రూ. 50వేలతో మెటల్ రోడ్డు ఏర్పాటు

డోన్‌పట్టణం, న్యూస్‌టుడే : పట్టణంలోని రైల్వే గేట్ల మధ్యలో రహదారులపై గుంతలు ఏర్పడ్డాయి. దీంతో రూ.50వేలతో మెటల్ రోడ్ వేసేందుకు మున్సిపల్ అధికారులు శుక్రవారం చర్యలు తీసుకున్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

ప్యాపిలి,న్యూస్‌టుడే: స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో చదువుతున్న తొమ్మిది మంది విద్యార్థులు రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు సరళాదేవి పేర్కొన్నారు.

గణేష్ ఉత్సవాలు ప్రశాంతంగా ముగిశాయి

డోన్, న్యూస్‌టుడే : గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా ముగించేందుకు గణేష్ మహోత్సవ కేంద్ర సమితి సభ్యులతో పాటు అన్ని శాఖల అధికారులు కలిసికట్టుగా కృషిచేశారని పట్టణసీఐ ఇంతియాజ్‌బాషా అన్నారు.

నిలిచిపోయిన బస్సుల రాకపోకలు

సంజామల న్యూస్‌టుడే : అవుకు రిజర్వాయర్ కట్ట దెబ్బతినటంతో అధికారులు రిజర్వాయర్ నుంచి పాలేరువాగుకు నీటిని అధికంగా వదిలారు. దీంతో శుక్రవారం సంజామల మీదుగా కోవెలకుంట్ల నుంచి తాడిపత్రికి బస్సుల రాకపోకలు నిలిచిపోయాయి.

మంత్రి బీసీకి నవరాత్రి ఉత్సవాల ఆహ్వాన పత్రిక

బనగానపల్లి న్యూస్‌టుడే : మండల పరిధిలోని నందవరం చౌడేశ్వరి ఆలయంలో అక్టోబర్ 3 నుంచి 12 వరకు జరిగే నవరాత్రి ఉత్సవాలకు


మంత్రి బీసీకి ఆహ్వాన పత్రిక ఇస్తున్న ఈవో కామేశ్వరమ్మ

శుక్రవారం రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డిని ఆహ్వానించారు. శుక్రవారం ఆలయ ఈవో కామేశ్వరమ్మ, ఆలయ మాజీ ఛైర్మన్ పీపీ కుమార్‌రెడ్డిలు మంత్రి ఇంటి వద్దకు వెళ్లి ఆహ్వాన పత్రికను అందజేశారు.

గెలుపోటములు సమానంగా స్వీకరించాలి

బనగానపల్లి గ్రామీణం న్యూస్‌టుడే : క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరించి క్రీడాస్ఫూర్తిని కలిగి ఉండాలని తెదేపా నేత బీసీ ఇందిరమ్మ పేర్కొన్నారు. మండల పరిధిలోని నందవరం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నియోజకవర్గ స్థాయి అండర్-14, అండర్-17 బాలబాలికల క్రీడాపోటీలు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పోటీలను ముఖ్య అతిథిగా హాజరైన ఆమె పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో తెదేపా మండల అధ్యక్షులు పీపీ కుమార్‌రెడ్డి,


పోటీలను ప్రారంభిస్తున్న బీసీ ఇందిరమ్మ తదితరులు

ఎంఈవో-1 శ్రీనివాసులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు బయ్యన్న, నియోజకవర్గంలోని వివిధ పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

బీసీ రాజారెడ్డిని కలిసిన యాగంటి ఈవో

బనగానపల్లె న్యూస్‌టుడే : మండల పరిధిలోని యాగంటి ఆలయం ఈవో డీఆర్‌కేవీ ప్రసాద్ శుక్రవారం బనగానపల్లె పట్టణ మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఉమా మహేశ్వర స్వామి వారి చిత్రపటాన్ని బీసీకి అందజేశారు.

ఘనంగా కోట్ల వర్ధంతి వేడుకలు


ప్యాపిలిలో కోట్ల విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న తెదేపా నాయకులు


ప్యాపిలి, న్యూస్‌టుడే: మాజీ ముఖ్యమంత్రి దివంగత కోట్ల విజయభాస్కర్‌రెడ్డి వర్ధంతి వేడుకలను తెదేపా నాయకులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు.

బేతంచెర్ల, న్యూస్‌టుడే : స్వయం కృషి పట్టుదల ప్రజా సేవకు మారు పేరుగా నిలిచిన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి దివంగత కోట్ల విజయభాస్కర్‌రెడ్డి సేవలు చిరస్మరణీయమని తెదేపా మండల కన్వీనర్ ఉన్నం ఎల్లనాగయ్య, మాజీ జడ్పీటీసీ సభ్యురాలు బుగ్గన ప్రసన్నలక్ష్మి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక తెదేపా కార్యాలయంలో కోట్ల విజయభాస్కర్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు బీమేష్‌రెడ్డి, బుగ్గన ప్రభాకర్‌రెడ్డి, జాకీరుల్లాబేగ్, మేకల నాగరాజు, రూబెన్, రవీంద్ర నాయక్, సుబ్బారెడ్డి, రాముడు, పాల్గొన్నారు.

ఆరోగ్యమే మహాభాగ్యం

సంజామల, న్యూస్‌టుడే : ఆరోగ్యమే మహాభాగ్యమని తెదేపా గ్రామ నాయకులు శీల క్వాలిటీ ఫ్యూయల్ ఓనర్ శీల వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని పేరుసోముల గ్రామంలో శుక్రవారం శీల క్వాలిటీ ఫ్యూయల్ డీలర్ మానేని మల్లేశ్వరమ్మ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్యశిబిరాన్ని కడప జిల్లా సీఎస్ఐ క్యాంబెల్ వైద్యశాల డా.అగస్టిన్ సమక్షంలో నిర్వహించారు. 400 మంది రోగులకు వైద్య చికిత్సలు అందించినట్లు నిర్వాహకులు తెలిపారు.

ముళ్ల పొదలు.. ముందుకు కదలని నీళ్లు



మండల పరిధిలోని రూపనగుడి చెరువు పంట కాల్వ 1150 మీటర్ల పొడవులో ఉంది. కాల్వ ఇరువైపుల ముళ్ల పొదలు, జమ్ము గడ్డి అల్లుకుపోయాయి. చెరువు నుంచి వచ్చే సాగునీరు పంట కాల్వల ద్వారా ముందుకు వెళ్లడం లేదు. ముళ్లపొదలు తొలగించాలని అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే ఉయ్యాలవాడ

మేజర్ పంచాయతీలో... సమస్యల నగారా

శిరివెళ్ల న్యూస్‌టుడే : శిరివెళ్ల మేజర్ పంచాయతీలో ఎక్కడ చూసినా సమస్యలు వేధిస్తున్న పట్టించుకునే వారే కరువయ్యారు. మేజర్ పంచాయతీ పరిధిలో ప్రధానంగా డ్రైనేజీ, సీసీ రహదారులు, విద్యుత్తు స్తంభాల ఏర్పాటు, వీధిపోల కొరత, తాగునీటి సమస్యతో ప్రజలు నిత్యం అవస్థలు పడుతున్నారు. గ్రామ పంచాయతీ కార్యదర్శిగా రెగ్యులర్ ఈవోపీ లేకపోవడంతో ప్రస్తుతం ఇన్‌ఛార్జి ఈవోగా ఈవోపీఆర్డీనే ఉన్నారు. గ్రామ సమస్యలపై ఉన్నతాధికారులు దృష్టి సారించి సమస్యలను పరిష్కరించాలని గ్రామస్థులు కోరుతున్నారు.


శిరివెళ్లలో చిన్నపాటి వర్షానికే రహదారిపై నిలిచిన వరద నీరు

ఆదాయం ఉన్నా అభివృద్ధి అంతంతమాత్రమే

శిరివెళ్ల మేజర్ పంచాయతీ కావడం, దీని పరిధిలో మజరా గ్రామాలైన బాచరబాద, వెంకటేశ్వరపురం, కొట్టాలపల్లె ఉండటంతో జనాభా ప్రాతిపదికన ఏటా ఆదాయం పెరుగుతూ వస్తుంది. ఏటా రోజువారీ, వారపు సంత, కబేలా రూపంలో గ్రామ పంచాయతీకి రూ. 16లక్షలు, రిజిస్ట్రేషన్ రూపంలో రూ. 7లక్షలు, కుళాయి, ఇంటి, గ్రందాలయం తదితర పన్నుల రూపంలో రూ. 15లక్షలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామాభివృద్ధికి ఇచ్చే నిధులు రూ. 90లక్షలకు పైగానే సమకూరుతాయి. ఏటా ఇంత పెద్ద మొత్తంలో ఆదాయం సమకూరుతున్న అధికారులు మాత్రం అభివృద్ధిపై దృష్టి సారించడం లేదు. దీంతో ఎక్కడికక్కడ సమస్యలు తిష్టవేశాయి.

పంచాయతీలోని ప్రధాన సమస్యలు

★ మేజర్ పంచాయతీలో తెలుగుపేట, దేగలపేట, ముబారక్‌పేట, బలిజపేట, ఆకుతోటపేట, రాముని మాన్యం కాలనీల్లో ఎక్కడా సీసీ రహదారి నిర్మాణానికి నోచుకోవడం లేదు.

★ ప్రధాన రహదారి, రుద్రవరం రస్తా, పోలీస్‌స్టేషన్, ఎస్సీ, బీసీ తదితర కాలనీల్లో డ్రైనేజీ కాలువలు లేకపోవడంతో చిన్నపాటి వర్షం కురిసిన మురుగు నీరంతా రోజుల తరబడి రహదారులపైనే నిలుస్తోంది.

★ 16 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా కేవలం ఒక్క కేంద్రానికి మాత్రమే ప్రభుత్వ భవనం ఉంది. మిగిలినవి అన్ని అద్దే భవనాల్లోనే కొనసాగుతున్నాయి.

★ గ్రామ పంచాయతీలో ఓ సచివాలయం కొనసాగుతుండగా, మిగిలిన మూడు సచివాలయాలు అద్దె భవనాల్లో, వారపు సంత వక్ఫ్‌బోర్డు స్థలంలో కొనసాగుతున్న పరిస్థితి ఉంది.

విడతల వారీగా సమస్యలు పరిష్కరిస్తాం
నాగేంద్రుడు ఈవోపీఆర్డీ ఇన్‌ఛార్జి ఈవో శిరివెళ్ల

మేజర్ గ్రామ పంచాయతీలో సమస్యలు ఉన్న మాట వాస్తవమే. గ్రామంలోని ప్రధాన సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా విడుదలయ్యే నిధులతో విడతల వారీగా పరిష్కరిస్తాం.

పర్యాటక ప్రదేశాలతో మానసికోల్లాసం

అహోబిలం (ఆళ్లగడ్డ గ్రామీణం),న్యూస్‌టుడే : పర్యాటక ప్రదేశాల సందర్శనతో మానసికోల్లాసం లభిస్తుందని ఆళ్లగడ్డ ప్రభుత్వ డిగ్రీ కళాశాల


ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, పర్యాటక వసతి గృహ సిబ్బంది

అధ్యాపకులు డా.గంగన్న పేర్కొన్నారు. మండలంలోని అహోబిలం గ్రామంలో ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ఆలయ పరిసరాల్లో పిచ్చిమొక్కలు, చెత్తచెదారం తొలగించి విద్యార్థులు శ్రమదానం చేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు కాశీ విశ్వనాథ్, నాగమస్తాన్, టూరిజం సిబ్బంది కిరణ్ కుమార్‌రెడ్డి, గోపాల్, నాయక్ పాల్గొన్నారు.

పశుకిసాన్ క్రెడిట్ కార్డు రుణాలపై అవగాహన

కోవెలకుంట్ల, న్యూస్‌టుడే : పాడి రైతులకు పశుకిసాన్ క్రెడిట్ కార్డులపై అవగాహన కల్పించాలని ఆళ్లగడ్డ పశు వైద్యశాఖ డిప్యూటీ డైరెక్టర్ డీవీ రమణయ్య అన్నారు. కోవెలకుంట్లలోని పశువైద్యశాలలో ఏడీ వీరబ్రహ్మం ఆధ్వర్యంలో గోపాల్, సచివాలయాల్లో మండలాల పశువైద్యాధికారులతో నెలవారీ సమీక్షా సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ కార్డు ద్వారా బ్యాంకుల నుంచి రూ. 25వేల నుంచి రూ. 1.5లక్షల వరకు రుణ సదుపాయం పొందవచ్చన్నారు. ఇక్కడ పనిచేస్తున్న ఏడీ వీరబ్రహ్మం డీడీగా పదోన్నతిపై జమ్మలమడుగు డివిజన్ కార్యాలయానికి బదిలీ కావడంతో శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పశువైద్యాధికారులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పరుగు పోటీలకు విద్యార్థులు ఎంపిక

డోన్‌పట్టణం, న్యూస్‌టుడే : కర్నూలులోని డీఎస్ఏ స్టేడియంలో ఈ నెల 26వ తేదీన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి పరుగు పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు బి. తన్విరెడ్డి, బి. సాత్విరెడ్డిలు ప్రతిభ చాటారని శ్రీసాయి సీబీఎస్ఈ పాఠశాల ప్రిన్సిపల్ అహమ్మద్ నవాజ్ తెలిపారు. వారిద్దరిని రాష్ట్రస్థాయి పరుగు పోటీలకు ఎంపిక చేశారని పేర్కొన్నారు. విద్యార్థుల ప్రతిభ పట్ల పాఠశాల గౌరవ సలహాదారుడు సుదర్శన్, వైస్ ప్రిన్సిపల్ రంజన్, వ్యాయామ ఉపాధ్యాయులు నజీర్ బాషా, సురేష్, హర్షం వ్యక్తం చేశారు.


రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులను అభినందిస్తున్న పాఠశాల ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు

మురుగులో తాగునీటి గొట్టాలు



నగర పంచాయతీలో పలు వీధుల్లో తాగునీటి కుళాయిలు, గొట్టాలు మురుగు కాల్వలో ఉండటంతో నీరు కలుషితమవుతోంది. ఆంజనేయస్వామి ఆలయం సమీపంలో గోరుకల్లు నుంచి పట్టణంలోకి సరఫరా చేసే నీటి గొట్టాలు లీకేజీ అవుతున్నాయి. దీంతో నీరు కలుషితమవుతోంది. అందులోనే నీటి వాల్వ్ ఉండటంతో జనం రోగాల పాలవుతున్నారు. అధికారులు దృష్టి సారించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే బేతంచెర్ల

ట్రాక్టర్ అపహరించిన నిందితుడు అరెస్టు

బనగానపల్లి, న్యూస్‌టుడే : బనగానపల్లి మండలం ఇల్లూరుకొత్తపేట గ్రామం వెంకటసుబ్బారెడ్డికి చెందిన ట్రాక్టర్‌ను అపహరించిన కేసులో టీఎం హరీష అనే నిందితుడిని అరెస్టు చేసినట్లు సీఐ కృష్ణయ్య శుక్రవారం తెలిపారు. సీఐ కథనం ప్రకారం ఈ నెల 19న రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ట్రాక్టర్‌ని దొంగలించగా, బాధితుడు 25న స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. పోలీసులు దర్యాప్తు చేసి కర్ణాటక రాష్ట్రం బాగేపల్లె తాలూకా తిమ్మంపల్లె గ్రామానికి చెందిన టీఎం హరీష దొంగలించుకు పోయినట్లు గుర్తించారు. నిందితుడిని అదుపులోకి తీసుకొని ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా త్వరగా కేసును చేదించిన పోలీసులకు ప్రత్యేకంగా సీఐ అభినందనలు తెలిపారు. ఎస్. ఐ. దుగ్గిరెడ్డి పాల్గొన్నారు.

దొంగతనం కేసు నమోదు

కోవెలకుంట్ల, న్యూస్‌టుడే : మండలంలోని అమడాల గ్రామంలో దొంగతనం జరిగినట్లు ఎస్సై మల్లికార్జునరెడ్డి శుక్రవారం తెలిపారు. ఎస్సై వివరాల మేరకు చెన్నుడు కుటుంబ సభ్యులతో కలిసి పొలం పనులకు వెళ్లగా గుర్తు తెలియని వ్యక్తి ఇంట్లోకి ప్రవేశించి 3తులాల బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లారు. బాధితులు ఇంటికి వచ్చి చూసుకొని పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు

కోవెలకుంట్ల, న్యూస్‌టుడే : మండలంలోని కంపమల్ల గ్రామానికి చెందిన నలుగురిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినట్లు ఎస్సై మల్లికార్జునరెడ్డి శుక్రవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన శాంతమ్మ పొలాన్ని అదే గ్రామానికి చెందిన వెంకట్రాముడు కుటుంబం దౌర్జన్యంగా ఆక్రమించుకున్నారు. అడ్డుకున్న ఆమెను కొట్టి కులం పేరుతో దూషించి చంపుతామని బెదిరించారు. ఈ మేరకు బాధితురాలు ఫిర్యాదు చేయడంతో వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

అత్తింటివారిపై వేధింపుల కేసు

కోవెలకుంట్ల న్యూస్‌టుడే : అత్తింటివారిపై వేధింపుల కేసు నమోదు చేసినట్లు ఎస్సై మల్లికార్జునరెడ్డి శుక్రవారం తెలిపారు. కోవెలకుంట్లకు చెందిన వెంకటేశ్, మహేశ్వరీలు రెండేళ్ల క్రితం వివాహం అయింది. కొంతకాలం తర్వాత భార్యను భర్త, అతని కుటుంబ సభ్యులు వేధింపులకు గురి చేస్తుండటంతో భరించలేక బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు భర్త కుటుంబసభ్యులు 6గురిపై కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

స్వయంఉపాధి వైపు నారీమణుల అడుగులు

డోన్ న్యూస్‌టుడే : గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలు స్వయం ఉపాధివైపు అడుగులు వేస్తూ ఆర్థిక వృద్ధి సాధిస్తున్నారు. మహిళలు సొంతంగా వ్యాపారాలు చేసుకుంటూ ఆర్థికంగా అభివృద్ధి చెందితే వారి కుటుంబంతో పాటు గ్రామం ఎంతో వృద్ధిలోకి వస్తుంది. మహిళలు ఆర్థికంగా ఎదగడానికి కెనెరా బ్యాంకు అధికారులు చేయూతనిస్తున్నారు. కెనెరాబ్యాంకు, స్వయం ఉపాధిశిక్షణా సంస్థ ఆధ్వర్యంలో నాలుగేళ్లుగా గ్రామాల్లో పొదుపు సంఘాల మహిళలకు శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.


కెనెరాబ్యాంకు, స్వయంఉపాధి శిక్షణా సంస్థల ఆధ్వర్యంలో శిక్షణపొందిన మహిళలు

మండలంలోని కొచ్చెర్వు, చింతలపేట గ్రామాల్లో కెనెరాబ్యాంకు ఆధ్వర్యంలో స్వయం ఉపాధి శిక్షణా సంస్థ పొదుపు సంఘాల మహిళలకు ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తుంది. పొదుపు సంఘాల్లో ఉత్సాహంగా పనిచేసే సభ్యులను ఎంపిక చేసుకుని వారికి 6రోజుల పాటు శిక్షణను ఇస్తున్నారు. శిక్షణ పొందినట్లుగా ప్రత్యేకంగా ధృవీకరణ పత్రాన్ని సైతం అందజేస్తున్నారు. శిక్షణ పొందిన వారికి వ్యాపారం చేసుకోవాలంటే కెనెరా బ్యాంకు తరుపున ముద్రరుణాలు అందజేస్తున్నారు. శిక్షణలో నేర్పిస్తున్న నైపుణ్యాల గురించి ఇటీవల శిక్షణ పూర్తి చేసుకున్న మహిళల మాటల్లోనే..

ఒకే వ్యాపారంవైపు అందరూ వెళ్లకూడదని తెలుసుకున్నా - రవళి



మాకు నిర్వహించిన స్వయం శిక్షణ కార్యక్రమంలో అధికారులు ఎన్నో మంచి విషయాలు తెలియజేశారు. వ్యాపార రంగంలో ఎవరైనా ఏదైనా వ్యాపారం చేస్తుంటే మనం కూడా అదే వ్యాపారంలోకి వెళ్లకూడదని తెలుసుకున్నాను. ఏ వ్యాపారం చేసిన అందులో నాణ్యతను పాటించాలి. ఇలాంటి విషయాలు తెలుసుకోవటంతో జీవితంలో ఏదైనా సాధించగలనన్నా నమ్మకం కలిగింది.

మాలో ఆత్మవిశ్వాసం పెరిగింది –విశాలమ్మ



వ్యాపారంలో మహిళలు ఏం రాణిస్తారు అని కాకుండా, మహిళలు అనుకుంటే ఏదైనా సాధించవచ్చునేలా మాలో స్ఫూర్తి నింపారు. గొర్రెల పెంపకం, కుట్టు శిక్షణ, మగ్గంపనులు, కిరాణం, ఫ్యాన్సీ స్టోర్లు, బ్యాంగిల్స్ దుకాణాలు ఇలా ఎన్నో రకాల వ్యాపారాల్లోనూ మహిళలు వృద్ధి చెందవచ్చునని తెలుసుకున్నాను. కెనెరాబ్యాంకు ఆధ్వర్యంలో చేపట్టిన శిక్షణ కార్యక్రమం నాకెంతోగానో ఉపయోగపడింది.

కుట్టుమిషన్ శిక్షణతో ఎంతో నేర్చుకున్నా –లలిత



కెనెరా బ్యాంకు ద్వారా ఇచ్చిన శిక్షణతో ఎంతో నేర్చుకున్నాం. ముఖ్యంగా గొర్రెల వ్యాపారం, కుట్టుశిక్షణ, చీరలవ్యాపారం వంటివాటిని ఎలా చేయాలనే దానిపై అవగాహన కల్పించారు. ఇలాంటి శిక్షణలు ఇస్తే మహిళలు ఆర్థికంగా స్వయం వృద్ధి సాధించేందుకు మంచి అవకాశం ఉంటుంది.

అవసరం అయితే ముద్రలోన్‌లు ఇస్తాం
– నరేష్‌కుమార్, కెనెరా బ్యాంకు మేనేజర్

నాలుగేళ్లుగా మహిళలకు వ్యాపార రంగంలో ఎలా రాణించాలనే విషయాలపై కెనెరాబ్యాంకు, స్వయం ఉపాధి శిక్షణ సంస్థల ఆధ్వర్యంలో అవగాహన కల్పిస్తున్నాం. వ్యాపారంలో మెలకువలు, ఒడిదుడుకులు, వాటిని ఎలా ఎదుర్కోవాలనే విషయాలపై అవగాహన కల్పించాం. ఆసక్తి ఉన్నవారికి ముద్రలోన్‌లు ఇస్తాం.